ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 57 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప సోమవారం 3 నవంబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 57 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA MON 3 NOVEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టు





- ఇబ్రహీంపట్నంలోని నివాసంలో అదుపులోకి తీసుకున్న సిట్
- భారీ పోలీసు బందోబస్తు మధ్య నాటకీయ పరిణామాలు
- రాజకీయ కక్షతోనే తనను ఇరికించారన్న జోగి రమేశ్
- ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన జోగి అరెస్టు

నకిలీ మద్యం కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అరెస్టు చేశారు. కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో ఈరోజు ఉదయం నాటకీయ పరిణామాల మధ్య ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టు ఏపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఈ రోజు ఉదయం భారీ పోలీసు బలగాలతో సిట్ అధికారులు జోగి రమేశ్ ఇంటికి చేరుకున్నారు. తొలుత ఆయన అనుచరుడైన రాము ను విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం, హైడ్రామా నడుమ జోగి రమేశ్‌ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. వారికి అభివాదం చేస్తూనే జోగి రమేశ్ పోలీసు వాహనంలోకి ఎక్కారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్ధనరావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే జోగి రమేశ్‌ను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. జోగి రమేశ్ ప్రోద్బలంతోనే తాను నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్ధన రావు విచారణలో వెల్లడించినట్టు సమాచారం.

వివరాలు 2లో..

## 4న కృష్ణా జిల్లాలో వైయస్ జగన్ పర్యటన



విజయవాడ: వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 4వ తేదీన కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. పెడన నియోజకవర్గం గూడురులో వైయస్ జగన్ పర్యటిస్తారు మోంథా తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను వైయస్ జగన్ పరిశీలించనున్నారు. మోంథా తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించనున్నారు. వైఎస్ జగన్ కృష్ణా జిల్లా పర్యటనకు సంబంధించిన పర్యటన వివరాలను వైయస్‌ఆర్‌సీపీ నేతలు తలశిల రఘురాం, పేర్ని నానిలు వెల్లడించారు.

## జోగి పాపం పండింది

- మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టుపై మంత్రి అనగాని రియాక్షన్
- నకిలీ మద్యం తయారు చేయించాడంటూ తీవ్ర ఆరోపణలు
- సూత్రధారి జోగి.. పాత్రధారి అద్దేపల్లి ముఠా అన్న మంత్రి

వివరాలు 2లో..



## ముమ్మాటికీ ఇది అక్రమ అరెస్టు



- నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్ట్
- చంద్రబాబుపై ధ్వజమెత్తిన జగన్
- ప్రజల దృష్టి మళ్లించేందుకే కుట్రలకు పాల్పడుతున్నారంటూ విమర్శలు
- సిట్ విచారణ ఒక బూటకం అని ఆరోపణ

వివరాలు 2లో..



## కుటుంబ సమేతంగా వరల్డ్ కప్ ఫైనల్ కు హాజరైన మంత్రి నారా లోకేశ్...

- నవీ ముంబైలో మహిళల వరల్డ్ కప్ ఫైనల్
- భారత్, దక్షిణాఫ్రికా అమీతుమీ
- భార్య బ్రహ్మణి, కుమారుడు దేవాన్ష్ తో కలిసి లోకేశ్ మ్యాచ్ వీక్షణ
- క్రికెట్ దిగ్గజం సచిన్ ను కలిసిన లోకేశ్

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ కుటుంబ సమేతంగా ఐసీసీ మహిళల క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ కు హాజరయ్యారు. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తుదిపోరును ఆయన తన భార్య బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ తో కలిసి ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చారు.

వివరాలు 2లో..

## వైసీపీ డ్రగ్ దొంగలు మరోసారి దొరికారు




- విశాఖలో వెలుగు చూసిన ఎల్ఎస్‌డీ డ్రగ్స్ రాకెట్
- దురంతో ఎక్స్‌ప్రెస్‌లో 36 ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్‌తో పట్టుబడ్డ యువకుడు
- వైసీపీ విద్యార్థి విభాగం నేత కొండారెడ్డి కోసం డ్రగ్స్ సరఫరా
- కొండారెడ్డిని అదుపులోకి తీసుకున్న ఈగల్ టీం, టాస్క్ ఫోర్స్
- యువతను డ్రగ్స్‌కు బానిసలుగా చేస్తున్నారంటూ వైసీపీపై మంత్రి అచ్చెన్న ఫైర్
- వైసీపీ సమాజానికి ప్రమాదకరమన్న మంత్రి అచ్చెన్నాయుడు

వివరాలు 2లో..

## ఇస్రో ఖాతాలో బాహుబలి విజయం...

## సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం గ్రాండ్ సక్సెస్



- శ్రీహరికోట నుంచి విజయవంతంగా దూసుకెళ్లిన LVM3-M5 రాకెట్
- భారత నావికాదళానికి చెందిన CMS-03 ఉపగ్రహ ప్రయోగం సక్సెస్
- దేశంలోనే అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌గా గుర్తింపు
- సుమారు 4,400 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం
- నేవీ కమ్యూనికేషన్, సముద్ర నిఘా సామర్థ్యాలు మరింత బలోపేతం
- నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో ప్రవేశపెట్టిన ఇస్రో

వివరాలు 2లో..

## చెరువులో దిగి చేపల వల లాగిన రాహుల్ గాంధీ...

- బీహార్‌లోని బెగుసరాయ్‌లో పర్యటించిన రాహుల్ గాంధీ
- మత్స్యకారులతో సమావేశమై వారి సమస్యల గురించి ఆరా
- స్వయంగా నీటిలోకి దిగి మత్స్యకారులతో కలిసి వల లాగిన వైనం
- మత్స్యకారుల కఠోర శ్రమ, అభిరుచి స్ఫూర్తిదాయకమన్న రాహుల్
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్యకారులు కీలక భాగమని వెల్లడి
- వారి హక్కుల కోసం ప్రతి అడుగులోనూ అండగా ఉంటానని హామీ

వివరాలు 2లో..



## మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమ అరెస్టు దారుణం

నెల్లూరు లోని మేకపాటి గౌతమ్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో దివంగత మాజీ మంత్రి గౌతమ్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళు లర్పించిన వైయస్‌ఆర్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి పి అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి, వైయస్‌ఆర్‌సీపీ నేతలు. అనంతరం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్.నెల్లూరు: మాజీ మంత్రి జోగి రమేష్ ను అరెస్టు

వివరాలు 2లో..



## లండన్ చేరుకున్న సీఎం చంద్రబాబు దంపతులు... తెలుగు కుటుంబాల ఆత్మీయ స్వాగతం...



- వ్యక్తిగత పర్యటన కోసం లండన్ వెళ్లిన సీఎం చంద్రబాబు దంపతులు
- లండన్‌లో తెలుగు కుటుంబాల నుంచి ఘన స్వాగతం
- నారా భువనేశ్వరికి ఒకే వేదికపై రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు
- సామాజిక సేవకుగాను 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్' అవార్డు
- హెరిటేజ్ ఫుడ్స్‌కు 'గోల్డెన్ పీకాక్' పురస్కారం
- రేపు ఐఓడీ సంస్థ నుంచి అవార్డులు అందుకోనున్న భువనేశ్వరి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి లండన్ చేరుకున్నారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్ వెళ్లిన చంద్రబాబు దంపతులకు విమానాశ్రయంలో తెలుగు కుటుంబాలు ఆత్మీయ స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా చంద్రబాబు అక్కడి తెలుగువారితో ఆప్యాయంగా

వివరాలు 2లో..

## కరూర్ ఘటనకు విజయే బాధ్యుడు.. ఉదయనిధి స్టాలిన్ సంచలన ఆరోపణలు!

- తమిళనాడులో తీవ్రమవుతున్న రాజకీయ వివాదం
- కరూర్ తొక్కిసలాట ఘటనపై నటుడు విజయ్‌పై ఉదయనిధి ఫైర్
- 41 మంది మృతికి విజయే ప్రధాన బాధ్యుడంటూ పరోక్ష ఆరోపణలు
- ఈ ఘటనపై ఇప్పటికే కొనసాగుతున్న సీబీఐ విచారణ
- విజయ్‌ను నియంత్రించేందుకే బీజేపీ కుట్ర అని డీఎంకే విమర్శ
- డీఎంకే, టీవీకే మధ్య పెరుగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు

పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో రాజకీయాలు వేడెక్కాయి. కరూర్‌లో 41 మంది మరణానికి కారణమైన తొక్కిసలాట ఘటనపై ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే)

వివరాలు 2లో..



## డీఎంకే అఖిలపక్ష సమావేశానికి విజయ్ డుమ్మా... రాజకీయ నాటకం అంటూ ఫైర్



- డీఎంకే అఖిలపక్ష సమావేశాన్ని బహిష్కరించిన విజయ్
- ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగ విరుద్ధమని ఆరోపణ
- బీహార్ తరహాలో మైనారిటీ ఓట్లను తొలగించే ప్రమాదం ఉందన్న విజయ్
- అవినీతి నుంచి దృష్టి మళ్లించేందుకే డీఎంకే నాటకమని విమర్శ
- కేరళలా అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయలేదని ప్రశ్న
- ఓటర్ల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపడతామని ప్రకటన

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కవిత వెనుక రేవంత్ రెడ్డి ఉన్నాడా?

తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత వ్యవహారాలను ప్రస్తావిస్తూ ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**కేటీఆర్ సోదరి కవితపై రేవంత్ సానుభూతి**

రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో కవిత కుటుంబ ఆస్తి వివాదాల కారణంగా ఆమె తన ఇంటి నుంచి వెలివేయబడ్డారని ఆరోపించారు. ఈ ఘటనతో కవిత కన్నీరు పెట్టుకున్నారని ఆయన పేర్కొన్నారు. “తన సొంత చెల్లిని కాపాడలేని వ్యక్తి, ప్రజల సమస్యల కోసం ఏం చేస్తాడు? కవిత వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలకు స్పందించు ముందు, కేటీఆర్ ప్రజల సమస్యలపై మాట్లాడటానికి న్యాయం ఉందా?” అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**బీఆర్ఎస్–బీజేపీ ‘రహస్య ఒప్పందం’పై మరోసారి గుస్సా**

ఇదే సందర్భంలో రేవంత్ రెడ్డి మరోసారి బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ‘రహస్య ఒప్పందం’ను ప్రస్తావించారు. కవితకు ఆమెకు దక్కాల్సిన ఆస్తి వాటా ఇవ్వకుండా కుట్ర పన్నారని, ఈ రెండు పార్టీలు పరస్పర ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

**కవిత పరోక్ష విమర్శలు: కుటుంబ కలహాలు బహిరంగం?**

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ఇటీవల కవిత కూడా తన సోదరుడు కేటీఆర్‌పై పరోక్షంగా విమర్శలు చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. “తన బావ ఫోన్‌ను ఎవరు ట్యాప్ చేస్తారు?” అని ఆమె చేసిన వ్యాఖ్యలు కుటుంబంలో నెలకొన్న అంతర్గత ఉద్రిక్తతలను బయటపెట్టాయని భావిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు కుటుంబంలో నెలకొన్న సమస్యలను.. విభేదాలను స్పష్టం చేస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి**

జూబ్లీహిల్స్ ప్రజలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. తమ పాలనలో అభివృద్ధి , పారదర్శకతకు పెద్ద పీట వేస్తామని, ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని హామీ ఇచ్చారు.

ంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. కేటీఆర్–కవిత మధ్య ఉన్న సంబంధాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శిబిరంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

## కుటుంబ సమేతంగా వరల్డ్ కప్ ఫైనల్ కు హాజరైన మంత్రి నారా లోకేశ్...

- మొదటి పేజి తరువాయి

తొలిసారి ప్రపంచకప్ టైటిల్ ను ముద్దాడాలని తలపడుతున్న భారత మహిళల జట్టుకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా తన ఆనందాన్ని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. “చరిత్రను ప్రత్యక్షంగా చూసేందుకు బ్రాహ్మణి, దేవాన్ష్ తో కలిసి నవీ ముంబైలో ఉన్నాను. భారత జట్టుకు మద్దతు తెలపడం, మహిళల క్రికెట్ ఎదుగుదలను వేడుక చేసుకోవడం గర్వంగా ఉంది. స్టేడియంలో వాతావరణం అద్భుతంగా ఉంది. ఇలాంటి క్షణాలను కుటుంబంతో పంచుకోవడం, తర్వాతి తరానికి స్ఫూర్తినివ్వడం గొప్ప అనుభూతి” అని ఆయన పేర్కొన్నారు. ఈ మ్యాచ్ సందర్భంగా లోకేశ్ కు ఓ మధురానుభూతి ఎదురైంది. క్రికెట్ దేవుడిగా పేరుపొందిన దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ ను ఆయన కలుసుకున్నారు. ఈ భేటీ తనకు ఒక ‘ఫ్యాన్ బాయ్ మూమెంట్’ అని లోకేశ్ అభివర్ణించారు. సచిన్ వినయం, ఆప్యాయత గురించి విన్నవన్నీ నిజమేనని, వాటిని స్వయంగా అనుభవించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. తరతరాలకు స్ఫూర్తినిచ్చిన గొప్ప క్రీడాకారుడే కాకుండా, అంతకంటే గొప్ప మానవతావాది అని సచిన్ ను లోకేశ్ ప్రశంసించారు.

# నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టు

- మొదటి పేజి తరువాయి

ఈ వాంగ్మూలాన్ని కీలక ఆధారంగా తీసుకుని సిట్ అధికారులు తదుపరి చర్యలు చేపట్టారు. అయితే, ఈ ఆరోపణలను జోగి రమేశ్ మొదటి నుంచి ఖండిస్తున్నారు. ప్రభుత్వం తనపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన గతంలోనే స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే తనను ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అరెస్టు కావడంతో ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## లండన్ చేరుకున్న సీఎం చంద్రబాబు దంపతులు... తెలుగు కుటుంబాల ఆత్మీయ స్వాగతం...

- మొదటి పేజి తరువాయి

మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి రెండు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలను అందుకోనున్నారు. లండన్‌కు చెందిన ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) సంస్థ ఈ అవార్డులను ప్రకటించింది. సామాజిక సేవా రంగంలో నారా భువనేశ్వరి అందిస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ‘డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్’ అవార్డును ఆమెకు ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా, కార్పొరేట్ పాలనలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించినందుకు గాను హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు ‘గోల్డెన్ పీకాక్’ అవార్డు లభించింది. హెరిటేజ్ ఫుడ్స్ అధినేతగా ఈ పురస్కారాన్ని కూడా నారా భువనేశ్వరి అందుకోనున్నారు. ఎల్లుండి జరగనున్న కార్యక్రమంలో ఆమె ఈ రెండు అవార్డులను స్వీకరిస్తారు.

# మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమ అరెస్టు దారుణం

- మొదటి పేజి తరువాయి

చేయడం పై వైయస్ఆర్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు లోని దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వానికి ఏదైనా ఘటన వల్ల నష్టం జరిగితే .. దాన్నుంచి వెంటనే డైవర్షన్ చేయడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటన డైవర్షన్ లో భాగమే జోగి రమేష్ అక్రమ అరెస్టని తేల్చి చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...ఒకవైపు తుపాన్ విపత్తు వల్ల రైతులు నష్టపోతే వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మరోవైపు కాశీబుగ్గ ఆలయ తొక్కిసలాట ఘటన నుంచి దృష్టి మరల్చేదానికి జోగి రమేష్ ను అరెస్టు చేశారు. కల్తీ మద్యం తయారీలో మీ పార్టీ తరపున పోటీ చేసిన వ్యక్తితో పాటు మీ పార్టీ నేతలే నిందితులుగా ఉన్నారు. వారెవరనీ ఇంతవరకు అరెస్టు చేయలేదు. కేవలం కక్ష సాధింపు చర్యలతోనే ఒక తప్పుడు స్టేట్ మెంట్ రాయించి, దాని ఆధారంగా అరెస్టు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే ప్రక్రియ నడుస్తోంది. ఇవాళ మా పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్ ప్రజల్లోకి వస్తుంటే... ఆయన్ను ఎన్నుకోకపోవడం వల్ల నష్టం జరిగిందనే భావన వారిలో కనిపిస్తుంది. చంద్రబాబు అబద్దపు హామీల వల్ల మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారు. వీటన్నింటి నుంచి ప్రజల దృష్టి మరల్చుడానికే అరెస్టులు చేస్తున్నారు.

కల్తీ లిక్కర్ కేసుపై సీబీఐతో విచారణ చేయించండి, నా ప్రమేయం ఉంటే అరెస్టు చేయండని జోగి రమేష్ సవాల్ చేశారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సీబీఐతో విచారణ చేయించాలి. అప్పుడే నిజాలు బయటపడతాయి. అవేవీ చేయకుండా.. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ తరహా అరెస్టులకు పాల్పడుతున్నారు. కాశీబుగ్గ ఘటనలో ఆలయ ధర్మకర్త మీద కేసు పెట్టిన పోలీసులు... తిరుమలలో భక్తులు చనిపోయినప్పుడు టీటీడీ చైర్మన్ మీద ఎందుకు కేసులు పెట్టలేదు ? సింహాచలంలో జరిగిన ఘటనపై ఎందుకు కేసు పెట్టలేదు? పెద్దలకు ఒక న్యాయం, సామాన్యుడికి ఒక న్యాయమా? జరుగుతున్న కక్ష సాధింపు చర్యలను రాష్ట్ర ప్రజలందరూ గుర్తించారు. మీ అక్రమాలు, అన్యాయాలపై ప్రజలందరూ ఏకమై బుద్ధి చెప్పే సమయం వస్తుందని... తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అనిల్ కుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ముమ్మాటికీ ఇది అక్రమ అరెస్టు

నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ను అరెస్టు చేయడంపై ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ అక్రమ అరెస్టు అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నిస్సిగ్గుగా ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

“చంద్రబాబు గారూ... మీ నకిలీ మద్యం ఫ్యాక్టరీలు బయటపడ్డ వ్యవహారంలో అడ్డంగా మీరు దొరికిపోయి, దీని నుంచి తప్పించుకోవడానికి నిస్సిగ్గుగా కుట్రలకు పాల్పడుతూ మా పార్టీకి చెందిన బీసీ నాయకుడు, మాజీ మంత్రి జోగిరమేశ్ ను అన్యాయంగా అరెస్టు చేశారు. ముమ్మాటికీ ఇది అక్రమ అరెస్టు. జోగి రమేశ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను.

గత 18 నెలలుగా ప్రభుత్వం మీది, పాలన మీది. పట్టుబడ్డ నకిలీ మద్యం మీ హయాంలోనిది. పట్టుబడ్డవారిలో మీ పార్టీనుంచి ఎన్నికల్లో పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థి మొదలు, మీతోనూ, మీ కొడుకుతోనూ, మీ మంత్రులతోనూ, మీ ఎమ్మెల్యేలతోనూ, అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగినవారే ఉన్నారు. మీరు తయారు చేసిన మీ నకిలీ మద్యాన్ని అంతా అమ్మేది, మీరు తీసుకు వచ్చిన మీ ప్రైవేటు లిక్కర్ షాపుల్లోనే, మీ కార్యకర్తలు, నాయకులు నడిపే బెల్టుషాపుల్లోనే, పర్మిట్ రూముల్లోనే. మరి తయారీ మీది, చేసిన వారు మీవారు, అమ్మేదీ మీరే, కాని బురదజల్లేది, అక్రమ అరెస్టులు చేసేది మాత్రం మావాళ్లని.

నిన్న కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటకు కారణమైన ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టిమళ్లించడానికి, మొంథా తుపాను కారణంగా కుదేలైన రైతు గోడును పక్కదోవపట్టించడానికి ఈ అక్రమ అరెస్టుకు పాల్పడి, దుర్మార్గానికి ఒడిగట్టారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలంటూ జోగి రమేశ్ హైకోర్టులో పిటిషన్ వేసిన మరుసటిరోజే అరెస్టుకు దిగారంటే చంద్రబాబుగారూ.. మీరు ఎంతగా భయపడుతున్నారో అర్థం అవుతోంది. నకిలీ మద్యం వ్యవహారంలో మీ ప్రమేయం, మీ మనుషుల ప్రమేయం లేకపోతే సీబీఐ చేత విచారణకు భయమెందుకు చంద్రబాబు గారూ? ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? మీ జేబులో ఉన్న సిట్ మీరు ఏం చెబితే అది చేస్తుంది. మీరు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్. మీ మాఫియా వ్యవహారాల మీద మీరే విచారణ చేయించడం హాస్యాస్పదం కాదా? ఇలాంటి రాక్షస పాలనలో మీ నుంచి ఏమి ఆశించగలం?” అంటూ జగన్ ట్వీట్ చేశారు.

# వైసీపీ డ్రగ్ దొంగలు మరోసారి దొరికారు

బెంగళూరు నుంచి విశాఖపట్నానికి అక్రమంగా తరలిస్తున్న ఎల్ఎస్‌డీ (లైసెర్జిక్ యాసిడ్ డైఇథైలమైడ్) డ్రగ్స్‌ను ఈగల్ టీం, సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందిస్తూ వైసీపీపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ డ్రగ్స్ దొంగలు మరోసారి దొరికారంటూ ధ్వజమెత్తారు.

“ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డ్రగ్స్ వద్దు బ్రో అంటూ, రాష్ట్ర ప్రభుత్వం క్యాంపెయిన్ ఉద్యమంలా చేపట్టి యువతని రక్షిస్తుంటే, వైసీపీ పార్టీ మాత్రం, యువతని డ్రగ్స్‌కి బానిసలుగా మార్చటానికి, అన్ని ప్రయత్నాలు చేస్తోంది.. కానీ ఈగల్ టీం వాళ్ళకు చెక్ పెడుతోంది. బెంగళూరు నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్ రైలులో విశాఖపట్నానికి వస్తుండగా, చరణ్ అనే వ్యక్తిని ఈగల్ టీం, సిటీ టాస్క్ ఫోర్స్

కలిసి పట్టుకున్నాయి. అతని వద్ద నుంచి 36 ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో, ఈ స్ట్రిప్స్‌ను వైసీపీ స్టూడెంట్ విం?గ్ అధ్యక్షుడు కొండారెడ్డి కోసం తీసుకువస్తున్నట్టు వెల్లడైంది. అనంతరం కొండారెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువతని డ్రగ్స్ బానిసలుగా మార్చటానికి, వైసీపీ విద్యార్థి విభాగం నేతలే రంగంలోకి దిగటంతో, ఆ పార్టీ సమాజానికి ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది” అంటూ అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

## ఇస్రో ఖాతాలో బాహుబలి విజయం...

## సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం గ్రాండ్ సక్సెస్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. భారత నేవీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన అత్యాధునిక కమ్యూనికేషన్ ఉపగ్రహం %జమీ%-03ను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి బాహుబలి రాకెట్ %ూఎవీ3-వీ%5 ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. నిర్ణీత సమయానికి నింగిలోకి దూసుకెళ్లిన %ూఎవీ3-వీ%5 రాకెట్, %జమీ%-03 ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అనంతరం రాకెట్ నుంచి ఉపగ్రహం విజయవంతంగా విడిపోయిందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించిందని, ఇంజెక్షన్ ప్రక్రియ కచ్చితంగా జరిగిందని వారు తెలిపారు. %+ూూ-7=%గా కూడా పిలిచే ఈ %జమీ%-03 ఉపగ్రహం, భారత నావికాదళానికి ఇప్పటివరకు ఉన్నవాటిలో అత్యంత ఆధునికమైనది. ఇది నేవీ యొక్క అంతరిక్ష ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థను,

సముద్ర జలాలపై నిఘా సామర్థ్యాన్ని గణనీయంగా బలోపేతం చేయనుంది. నావికాదళం కార్యాచరణ అవసరాలకు తగినట్లుగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అనేక అత్యాధునిక భాగాలను ఇందులో అమర్చారు.

సుమారు 4,400 కిలోల బరువున్న ఈ శాటిలైట్, భారతదేశం ప్రయోగించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాలలో అత్యంత బరువైనది కావడం విశేషం. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దేశ రక్షణ వ్యవస్థలో మరో కీలక ముందడుగు పడినట్లయింది.

# జోగి పాపం పండింది

జగన్ పాలనలో నకిలీ మద్యంతో వేలాది మంది ప్రాణాలు తీశారని, వారి భార్యల మాంగళ్యాలు మంటగలిశాయని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టుపై మంత్రి స్పందిస్తూ.. జోగి పాపం పండిందని వ్యాఖ్యానించారు. నకిలీ మద్యం వ్యవహారంలో జోగి సూత్రధారి కాగా, పాత్రధారి అద్దేపల్లి జనార్థన్ రావు ముఠా అని ఆరోపించారు. నకిలీ మద్యం తయారు చేయించి బెల్టు షాపులు, ప్రభుత్వ షాపుల్లో అమ్మించాడని జోగి రమేశ్ పై మండిపడ్డారు. జగన్ ‘జే’ బ్రాండ్ మద్యం వల్ల ఏపీలో లక్షలాదిమంది ఆరోగ్యాలు గుల్ల అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ భూములు కబ్జా చేశారని మంత్రి ఆరోపించారు. ఆఫ్రికాకు పారిపోయే ముందు జనార్థనరావు మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి ఎందుకు వెళ్లాడని మంత్రి సత్య ప్రసాద్ ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ పుటేజ్ బయటకు వచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. న్యాయస్థానాల్లో సీసీటీవీ పుటేజ్ కు విలువ వుంటుందిగాని జోగి రమేశ్ ప్రమాణాలు, ఒట్టుకు, సవాళ్లకు విలువ ఉండదని చెప్పారు. మాజీ మంత్రికి ఈ కనీస జ్ఞానం కూడా లేదని ఎద్దేవా చేశారు. సీసీటీవీ పుటేజీలో స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ప్రమాణాలతో ప్రజలను వెర్రివాళ్లని చేయాలని జగన్ ముఠా భావిస్తోందని చెప్పారు.

జోగి రమేశ్ ప్రలోభాలతోనే 2022 నుంచి నకిలీ మద్యం తయారీ ప్రారంభించానని అద్దేపల్లి వాంగ్మూలం ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అతడికి రూ.3 కోట్లు ఆశ పెట్టింది, బాల్యం నుంచి వారిద్దరు స్నేహితులనేది నిజం కాదా అని అడిగారు. ఇలాంటి నిజాలు ఎన్నో ఉన్నా జగన్ అతడిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. ఇద్దరూ తోడుదొంగలు కాబట్టే చర్యలు తీసుకోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ నకిలీ మద్యం తయారీ, అమ్మకాలను సహించదు కాబట్టే జయచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేసి టీడీపీ తన నిజాయితీని రుజువు చేసుకుందని మంత్రి సత్య ప్రసాద్ చెప్పారు. వైసీపీ మాత్రం జోగి రమేశ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోగా ప్రశ్నించిన వారిపైనే ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. నేరస్తులపై చర్య తీసుకోవడం కక్ష సాధింపు ఎలా అవుతుందని మంత్రి ఈ సందర్భంగా ప్రశ్నించారు. జోగి అరెస్టును కక్ష సాధింపు చర్య అంటూ జగన్ ముఠా చేసే కాకి గోలను రాష్ట్ర ప్రజలు నమ్మబోరని చెప్పారు. నేరస్తులకు కులాలు ఉండవని, వీరు కుల ద్రోహులు కూడా అవుతారని చెప్పారు. వేలాది పేదల ప్రాణాలు తీసిన నకిలీ మద్యం తయారీదారులను అరెస్టు చేసిన సిట్ అధికారులను ప్రజలు అభినందిస్తున్నారని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు.

## డీఎంకే అఖిలపక్ష సమావేశానికి విజయ్ డుమ్మా...

తమిళనాడులో అధికార డీఎంకే పార్టీకి, నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (%ూ×=%)పై చర్చించేందుకు డీఎంకే ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాన్ని విజయ్ బహిష్కరించారు. ఈసీ చేపట్టిన ఈ సవరణ ప్రక్రియ పూర్తిగా “రాజ్యాంగ విరుద్ధం, రాజకీయ ప్రేరేపితం, ప్రజాస్వామ్యానికి పెను ముప్పు” అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు విజయ్ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వల్ల గతంలో బీహార్‌లో జరిగినట్లే తమిళనాడులో కూడా లక్షలాది మంది మైనారిటీ ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 30 రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని 6.36 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఎలా ధ్రువీకరిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఈసీ చర్యల్లో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి లోపించాయని, ఇంతటి హడావుడి ప్రక్రియ ప్రజల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. డీఎంకే ప్రభుత్వంపై కూడా విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. వారిపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎంకే ఈ అఖిలపక్ష సమావేశ నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. “ఈసీ నిర్ణయాన్ని నిజంగా వ్యతిరేకిస్తే, కేరళ అసెంబ్లీలో తీర్మానం చేసినట్లుగా డీఎంకే ప్రభుత్వం ఎందుకు చేయలేదు? ఈ సమావేశం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆడుతున్న ఓ మోసపూరిత రాజకీయ నాటకం” అని ఆయన అభివర్ణించారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం విజయ్ ఏడు కీలక సూచనలను కూడా ప్రతిపాదించారు. జాబితాలోని తప్పులను సరిదిద్దడం, నకిలీ ఓట్లను తొలగించడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ చేర్చడం, వయస్సు–చిరునామా ధృవీకరణకు ఆధార్ కార్డును అంగీకరించడం, తుది జాబితాను రాజకీయ పార్టీలకు, ప్రజలకు డిజిటల్‌గా అందుబాటులో ఉంచడం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ ప్రక్రియలో అవకతవకలు జరగకుండా స్థానిక ప్రతినిధులు, స్వతంత్ర పరిశీలకులను భాగస్వాములను చేయాలని ఈసీని కోరారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేసిన విజయ్, నిజమైన ఓటర్లను తొలగించకుండా చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ప్రత్యేక శిబిరాలను పర్యవేక్షిస్తామని ప్రకటించారు. “ప్రజాస్వామ్యం, హక్కులు, న్యాయం కోసం టీవీకే ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుంది” అని ఆయన పునరుద్ఘాటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని తమిళనాడులోని పలు ఇతర రాజకీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో విజయ్ విమర్శలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## చెరువులో దిగి చేపల వల లాగిన రాహుల్ గాంధీ...

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల ప్రచారంలో ఓ కొత్త పాత్రలో కనిపించారు. బెగుసరాయ్‌లో మత్స్యకారులతో సమావేశమైన ఆయన, కేవలం వారి సమస్యలు వినడానికే పరిమితం కాలేదు. స్వయంగా నీటిలోకి దిగి, వారితో కలిసి చేపల వల లాగి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకారులతో పూర్తిగా మమేకమై వారి జీవన విధానం, ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. వీఐపీ పార్టీ అధ్యక్షుడు ముఖేశ్ సహానీతో కలిసి రాహుల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తన అనుభవాలను పంచుకుంటూ, “ఈ రోజు బెగుసరాయ్‌లోని మత్స్యకార సోదరులను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. వారి పని ఎంత ఆసక్తికరంగా ఉంటుందో, దానితో ముడిపడి ఉన్న సమస్యలు, పోరాటాలు కూడా అంతే తీవ్రమైనవి” అని పేర్కొన్నారు.

“ప్రతికూల పరిస్థితుల్లోనూ వారి కఠోర శ్రమ, అభిరుచి, వ్యాపారంపై వారికి ఉన్న లోతైన అవగాహన ఎంతో స్ఫూర్తిదాయకంగా అనిపించింది” అని రాహుల్ గాంధీ వివరించారు. బీహార్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నదులు, కాలువలు, చెరువులు, వాటిపై ఆధారపడిన మత్స్యకారులు ఒక ముఖ్యమైన భాగమని ఆయన అభిప్రాయపడ్డారు. వారి హక్కులు, గౌరవం కోసం తాను ప్రతి అడుగులోనూ అండగా నిలుస్తానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

## కరూర్ ఘటనకు విజయే బాధ్యుడు.. ఉదయనిధి స్టాలిన్ సంచలన ఆరోపణలు!

- మొదటి పేజి తరువాయి

అధినేత విజయ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ దుర్ఘటనకు విజయే ప్రధాన బాధ్యుడని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ “కరూర్‌లో జరిగిన దానికి అందరూ బాధ్యులే, కానీ ఒకరు మాత్రం అత్యంత ప్రధాన బాధ్యులుగా ఉన్నారు” అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ఆయన నేరుగా విజయ్‌ను ఉద్దేశించారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ ఏర్పాటు చేసిన రాజకీయ ర్యాలీలోనే ఈ విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) విచారిస్తోంది. అయితే, విజయ్‌ను రాజకీయంగా నియంత్రించేందుకే బీజేపీ ప్రభుత్వం సీబీఐని రంగంలోకి దించిందని డీఎంకే ఆరోపిస్తోంది. ఈ దుర్ఘటన జరిగినప్పటి నుంచి డీఎంకే నేతలు విజయ్, ఆయన పార్టీ టీవీకేను బాధ్యులను చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలతో అధికార డీఎంకే, కొత్తగా ఏర్పాటైన టీవీకే మధ్య రాజకీయ ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ ఆరోపణలు తమిళనాడు రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి.

## ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



బనగానపల్లి పెన్ పవర్ నవంబర్ 2 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు&భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# మాతృభాష పరిరక్షణ ప్రజా ఉద్యమంగా రూపు దాల్చాలి

**– భారత గౌరవ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచన – జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి సందర్భంగా పురస్కారాల ప్రధానం**







**కడప, పెన్ పవర్ నవంబర్ 2 :** మాతృభాష పరిరక్షణ కేవలం పుస్తకాలు రాయడం, అవార్డులు ఇవ్వడం లేదా కార్యక్రమాలు నిర్వహించడంతోనే సాధ్యం కాదని, అది ప్రజా ఉద్యమంగా రూపు దాల్చాలని భారతదేశ గౌరవ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. బ్రౌన్ శాస్త్రిగా సుపరిచితులైన దివంగత డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారి శతజయంతి సందర్భంగా కడపలోని సీ.పీ.బ్రౌన్ స్మారక గ్రంథాలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన జానమద్ది స్మారక పురస్కారాల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, మాతృభాష పరిరక్షణ అంటే భావితరాలకు అమ్మభాషలోని మాధుర్యాన్ని అందించడమేనని స్పష్టం చేశారు. ఇందుకోసం తెలుగు భాషా ప్రేమికులు, సాహితీ వేత్తలు అందరూ పిల్లలకు సులభంగా తెలుగు నేర్పించే సృజనాత్మక పద్ధతుల్ని అన్వేషించాలని ఆయన పిలుపునిచ్చారు. మాతృభాషకు సేవలు అందించిన వారికి పురస్కారాలను అందించడం ఆనందంగా ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కరూ ముందుగా మనదైన అమ్మ భాషను ప్రేమించి, పట్టు సాధించాలి అని ఆయన ఉద్ఘాటించారు. మాతృభాషను కాపాడుకునేందుకు ప్రాథమిక విద్య మాతృభాషలో అందించడం, పరిపాలనా భాషగా ప్రాధాన్యత ఇవ్వడం, న్యాయస్థానాల కార్యకలాపాలు మాతృభాషలోనే సాగడం, ఉన్నత విద్యలో స్వదేశీ భాషల వినియోగం పెంచడం, ఇళ్లలో కుటుంబ సభ్యులతో మాతృభాషలోనే మాట్లాడటం అనే ఐదు అంశాలపై దృష్టి సారించాలని వెంకయ్యనాయుడు గారు నొక్కి చెప్పారు. తెలుగు వాడు కాకపోయినా తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించారని చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ స్మృతికి నివాళులు అర్పించారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు చేపట్టిన గ్రంథాలయ యజ్ఞం మహోన్నతమైనదని ఆయన కొనియాడారు. వారసత్వం అంటే కేవలం ఆస్తులు లేదా పదవులు కాదని, ఇలాంటి మంచి కార్యక్రమాల్ని చేపట్టడమే నిజమైన వారసత్వమని ఆయన పేర్కొన్నారు. గ్రంథాలయ నిర్వహణలో ఎంతో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారంటూ శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారి కుమారుడు శ్రీ జానమద్ది విజయభాస్కర్ గారిని అభినందించారు. "మన ఆట, మన పాట, మన భాష, మన యాస, మన గోస, మన కట్టు, మన బొట్టు, చివరకు మన తిట్టు సహా సంప్రదాయాలను పునరుజ్జీవింపచేసుకోవలసిన అవసరం ఉంది" అని శ్రీ వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. నాటక రంగానికి సేవలు అందించిన డా. గుమ్మడి గోపాలకృష్ణ, పంచ సహస్రావధాని తరువాయి 4లో..

## మత్స్యకార సంఘాలతో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భేటీ





**బనగానపల్లి పెన్ పవర్ నవంబర్ 2 :** బనగానపల్లె నియోజకవర్గంలోని అవుకు రిజర్వాయర్ పరిధిలోని మత్స్యకార సంఘాలు, కుటుంబాలతో సమావేశమైన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చిన అవుకు, సంగ పట్టణం, మెట్టుపల్లి గ్రామాల మత్స్యకారులు. మత్స్యకార కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి. మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని భరోసా ఇచ్చిన మంత్రి. మత్స్యకారులకు చేపల వేటకు అవసరమైన వలలు, బోట్లు వంటి అత్యాధునిక పరికరాలు సబ్సిడీ ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తుందన్న మంత్రి.

## ప్రభుత్వ అసమర్ధకు నిదర్శనం జోగి రమేష్ అరెస్ట్

### వైసీపీ రాష్ట్ర ఎస్ఇసి సభ్యుడు సత్య సాయినాథ్ శర్మ



**అమరావతి పెన్ పవర్ నవంబర్ 2 :** రాష్ట్రంలో కల్తీ మద్యం కేసులో రాష్ట్ర మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్ట్ చేయడం ఓటమి ప్రభుత్వ అసమర్ధకు నిదర్శనమని వైసీపీ రాష్ట్ర ఎస్ ఇ సి సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ అన్నారు కమలాపురంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సిబిఐ చేత విచారణ చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసిన మరుసటిరోజే పోలీసులు జోగి రమేష్ అరెస్ట్ చేయడం గమనిస్తే కూటమి ప్రభుత్వ డొల్లతనం బయటపడుతోందన్నారు .తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి,జయ చంద్రారెడ్డి ఆయన వెంట చంద్రబాబు నాయుడుతో కలిసి పార్టీ కండువా కప్పించుకున్న జనార్ధన రావు ఇద్దరు కలిసి చేస్తున్న కల్తీ మధ్య వ్యాపారంలో వైసీపీ నాయకులను బాధ్యులను చేయడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వ పనితీరు హాస్యాస్పదంగా మారిందన్నారు.అధికార పార్టీలోని నేతలు కల్తీ మధ్యానికి బాధ్యులు అయితే వారి చేత రాష్ట్ర మాజీ మంత్రి జోగి రమేష్ పై అసత్యపు ఆరోపణలు చేపించి అరెస్టు చేపించడం కూటమి ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం వైసీపీ నాయకుల పట్ల కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును గమనిస్తుంటే ఈ ప్రభుత్వం ఎవరి మీద అయితే కక్షగడుతుందో వారిని అరెస్టు చేయడానికి ఎన్ని తప్పుడు దారులు ఎంచుకుంటుందో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు గతంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి ఆలోచనలు చేసి ఉంటే తెలుగుదేశం పార్టీలోని నాయకులందరినీ ఇలాంటి కేసులలో ఇరికించి జైలు పాలు చేసి రాజకీయ జీవితానికి దూరం చేసే వారన్నారు. జగన్మోహన్ రెడ్డి మంచి మనసుతో నిజాయితీగా పరిపాలన క్చేశాడు కాబట్టి ఈరోజు కూటమి ప్రభుత్వంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు తమ మనుగడ కొనసాగించగలుగుతున్నారన్నారు.రాష్ట్రంలో పరిపాలన రోజురోజుకు విఫలమై దిగజారుతున్న కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ నాయకుల అరెస్టును బూచిగా చూపుతోందన్నారు.రాష్ట్రంలో కల్తీ మద్యం కేసులో వైసీపీ నాయకులను బాధ్యులుగా చేసి తన అసమర్థతను ప్రభుత్వం నిరూపించుకుందన్నారు మాజీ మంత్రి జోగి రమేష్ కల్తీ మద్యం కేసులో ఎటువంటి తప్పు చేయలేదు కాబట్టి తనపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి చేపిస్తున్న ఆరోపణలకు ధీటుగా ధైర్యంగా సిబిఐ విచారణ చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నందు పిటిషన్ వేసారన్నారు కల్తీ మద్యం కేసులో సిబిఐ విచారణ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా కల్తీ మద్యం కేసులో ఇరికిస్తున్న విషయాన్ని సిబిఐ బహిరంగం చేస్తుందన్న భయంతో జోగి రమేష్ ను అరెస్టు చేశారన్నారు.చంద్రబాబు నాయుడు 16 సంవత్సరాల ముఖ్యమంత్రి అనుభవం కేవలం వైసీపీ నాయకుల అక్రమ అరెస్టుకు మాత్రమే ఉపయోగిస్తున్నాడని ఆయన ఎద్దేవా చేశారు.రాజకీయాలకతీతంగా జోగి రమేష్ అరెస్టును ముక్తకంఠంతో అందరూ ఖండించాలని ఆయన కోరారు.

## నిగర్వి, నిర్మల ధర్మపరుడు 'రామ ముని రెడ్డి

### – ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి





**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** మారుమూల గ్రామం సామాన్య రైతు కుటుంబం లో పుట్టి అంచలంచెలుగా ఎదిగి 1983లో కడప శాసనసభకు పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిచి కేవలం 32 సంవత్సరాల వయసులోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన నిగర్వి, నిర్మల ధర్మపరుడు శిరిగిరెడ్డి రామ ముని రెడ్డి అని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక కడప పట్టణం ద్వారకా నగర్ లో ఉన్న శ్రీకృష్ణాలయం సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైయస్సార్ కడప జిల్లాల రచయితల సంఘం ఆధ్వర్యంలో రామ ముని రెడ్డి రచించిన స్వీయ చరిత్ర నా స్మృతి పథంలో... పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ స్వీయ చరిత్ర రాయడం కత్తి మీద సాము లాంటిదని, అయితే రామ ముని రెడ్డి చాలా జాగ్రత్తగా రాశారని, ఆయన జీవితం లో ఏదైతే చేశారో అది మాత్రమే రాశారని, నేటి యువతకు ఇలాంటి పుస్తకాలు మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ విద్వాన్ గానుగపెంటరావు ప్రసంగిస్తూ రాము ముని రెడ్డి నాకు గత 40 సంవత్సరాల నుండి పరిచయమని, నిర్దిష్టమైన ఆశయాలతో, నిస్వార్థ ప్రజా సేవకునిగా పేరు తెచ్చుకున్నారన్నారు. డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పుస్తక సమీక్ష చేస్తూ రామ ముని రెడ్డి బాల్యం నుండి తన జీవితంలో జరిగిన ప్రధాన సంఘటనలను సామాన్యులకు కూడా అర్థమయ్యే తీరులో రాశారని, ఆయన చిన్నప్పటినుండి సేకరించిన సూక్తులను కూడా ఈ పుస్తకలో ప్రచురించడం ముదావాహమన్నారు. విశిష్ట అతిథిగా డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ రామ మునిరెడ్డి రాజకీయాల నుండి విరమించి పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో జీవితాన్ని గడపడం ఆయన ఉన్నతమైన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. మరో విశిష్ట అతిథి డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి తన ప్రసంగంలో ఈ స్వీయ చరిత్ర ద్వారా ఆయన చేసిన అనేక మంచి కార్యక్రమాలు వెలుగులోకి రావడం శుభ పరిణామన్నారు. ఆత్మీయ అతిథిగా డాక్టర్ పొదిలి నాగరాజు మాట్లాడుతూ 1993లో సుందర చైతన్య స్వామి వారిని కడపకు ఆహ్వానించి ఆయనతో 18 రోజులు గీతా జ్ఞాన యజ్ఞం చేయించిన ఘనత ఆయనదేనన్నారు. మరో ఆత్మీయ అతిథి భూమిరెడ్డి స్వరూపారాణి మాట్లాడుతూ కడపలో ఇంత అద్భుతమైన శ్రీకృష్ణాలయ తరువాయి 4లో..

## 3న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ నవంబర్ 02 :** ఈ నెల 03న (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో meekosam.ap.gov.in ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

## ప్రజల ఇబ్బందులు తీరేలా పనుల ప్రణాళికల్ని సిద్ధం చేయండి







**ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులకు పరిటాల శ్రీరామ్ సూచన**

**15వ ఆర్థిక సంఘం నిధులపై అధికారులతో సమావేశం**

**అనంతపురం పెన్ పవర్ నవంబర్ 2 :** ప్రజల ఇబ్బందులు తీరేలా, అలాగే గ్రామాలు, కాలనీల్లో సమస్యలు పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అధికారులకు సూచించారు.15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలైన నేపథ్యంలో ఆయన నియోజకవర్గంలోని తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం, ముదిగుబ్బ ఎంపీడీఓలు, ధర్మవరం మున్సిపల్ కమిషనర్లతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ధర్మవరంలోని శ్రీరామ్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలాలు,పట్టణానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు. మండలానికి ఎంత మేర నిధులు రావచ్చు.. వాటితో ఎలాంటి పనులు చేయబోతున్నారన్న అంశాల గురించి చర్చించారు.ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించినప్పుడు ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇందులో గ్రామాల్లో తాగునీరు,స్మశాన వాటికలు,డ్రైనేజీలు, రోడ్లువంటివి ఉన్నాయన్నారు. ముందుగా వీటికి ప్రాధాన్యత ఇస్తూ పనుల రూపకల్పన చేయాలని అధికారులకు శ్రీరామ్ సూచించారు. ప్రాధాన్యత వారిగా పనులు చేపట్టాలన్నారు. ధర్మవరం పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలు చెప్పారని.. వాటి పై దృష్టి సారించాలని కమిషనర్ తో అన్నారు. ముందుగా గ్రామాలు, కాలనీలను ఒకసారి పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు..


# శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం

## మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి దర్శనం



**తిరుమల పెన్ పవర్ నవంబర్ 2 :** కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో ఆదివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ ఝామున 4.30 నుండి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులను కటాక్షించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ ఏడాదికోసారి కైశిక ద్వాదశి ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులందరికీ స్వామివారి కృపా కటాక్షాలు కలగాలని ప్రార్థించినట్లు తెలియజేశారు. ప్రాశస్త్యం.. పురాణాల ప్రకారం శ్రీ వైష్ణవ క్షేత్రాల్లో నిర్వహించే ముఖ్యమైన పర్వదినాల్లో కైశికద్వాదశి ఒకటి. శ్రీ వరాహ పెరుమాళ్ కైశికపురాణంలోని 82 శ్లోకాలతో శ్రీ భూదేవికి కథగా చెప్పిన రోజును కైశిక ఏకాదశిగా పిలుస్తారు. ఈ కథ ఆధారంగా కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది.


**నంబదువాన్ కథ :** కైశికద్వాదశి పురాణ నేపథ్యం విశేష ఘట్టాలతో కూడుకున్నది. శ్రీనంబదువాన్ (సత్యమూర్తి) అనే భక్తుడు స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించడానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఒక బ్రహ్మరాక్షసుడు తారసపడి తినేస్తానన్నాడు. తాను శ్రీవారికి సంకీర్తనార్చన చేయడానికి వెళుతున్నానని తప్పక తిరిగివచ్చి ఆ బ్రహ్మరాక్షసుని క్షుద్బాధను తీరుస్తానని నంబదువాన్ ప్రమాణం చేశాడు. అన్న ప్రకారం స్వామివారికి కైశిక రాగంలో అక్షరమాలను నివేదించి బ్రహ్మరాక్షసుని చెంతకు వచ్చాడు. భక్త నంబదువాన్ భక్తికి, సత్యనిరతికి ముగ్ధుడై స్వామివారు మోక్షం ప్రసాదించారు. ఈ విధంగా ఉత్థానద్వాదశికి కైశికద్వాదశి అనే నామకరణం కలిగింది. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.








## భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుగారిచే...






**కడప పెన్ పవర్ నవంబర్2 :** కార్యక్రమంలో.. 2025 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన కడప బాలవికాస్ పాఠశాల విద్యార్థులు.. గౌసియా, నీనా సహన, ప్రదీప్ కుమార్, గీతికా, రిహానా హుస్నా, గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ.. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో సాధించిన చిత్రకారుడు ఆనందరాజ్ కి, సాహితీవేత్త గుమ్మడి గోపాలకృష్ణ, అష్ట శతావధాని మెడసాని, రేవూరి అనంత పద్మనాభ , అంకె గౌడ గారికి 14వ సాహిత్య మరియు గ్రంథాలయ సేవా పురస్కారాలను ముఖ్య అతిధుల చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది.

## మరణం తరువాత ఏమి జరుగుతుంది?






**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను. మీరు పైనుండి విమానంలో ఎగురుతున్నప్పుడు ఏమి చూస్తారు? తక్కువ స్థాయిలో కొన్ని మేఘాలు, మధ్య స్థాయిలో కొన్ని మేఘాలు, మరొక స్థాయిలో కొన్ని మేఘాలు ఉంటాయి. సరియైనదే కదా? కొన్నిసార్లు మీరు రంగుల మేఘాలను కూడా చూస్తారు, కింద ముదురు మేఘాలు, పైన తెల్లని మేఘాలు, ఆ పైన దాదాపు కనిపించని మేఘాలు మరియు వాటికి పైన పూర్తిగా నీలి ఆకాశం కనిపిస్తుంది. అవి అక్కడ ఎలా స్థిరపడతాయి? వాటికి 'ఈ మేఘాలు సముద్ర మట్టానికి 1,000 అడుగుల పైన ఉండాలి. ఎక్కువ తేమతో కూడిన స్వచ్ఛమైన మేఘాలు ఒక నిర్దిష్ట ఎత్తులో ఉండాలి' అని నిర్దేశించడానికి మెదడు లేదు కదా? అలాగే, నీటి అణువుల ఉష్ణోగ్రత కూడా వాటిని ఒక నిర్దిష్ట స్థాయిలో స్థిరపడేలా చేస్తుంది. చాలా అంశాలు దీనిలో భాగమై, ఆ మేఘాల ఎత్తును నిర్ణయిస్తాయి.ఓ అదేవిధంగా, ఆత్మ (Soul) తన స్వచ్ఛత (Purity) ఆధారంగా, ఆయా ఎత్తుల యొక్క చైతన్య స్థాయిలను (Heights of Consciousness) చేరుకుంటుంది."

**వివరణ :** ఇది, భారతీయ తత్వశాస్త్రంలో ముఖ్యంగా హిందూ ధర్మంలోని కర్మ మరియు పునర్జన్మ (Karma and Rebirth) సిద్ధాంతాలకు దగ్గరగా ఉంటుంది.

ముఖ్య అంశాలు (Key Points) :

మరణానంతర స్థితి (Life After Death): హిందూ ధర్మం ప్రకారం, మరణం అనేది శరీరానికి మాత్రమే, ఆత్మ (Soul/ జీవాత్మ) శాశ్వతమైనది మరియు అమరమైనది. శరీరం నశించిన తర్వాత, ఆత్మ తన తదుపరి ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ఆత్మ యొక్క స్వచ్ఛత మరియు చైతన్య స్థాయిలు (Purity of Soul and Levels of Consciousness): మేఘాల పోలికలో చెప్పినట్లుగా, ఆత్మ ఏ స్థాయి చైతన్యాన్ని లేదా గతిని (Destination) చేరుకోవాలనేది దాని స్వచ్ఛతపై ఆధారపడి ఉంటుంది. ఒక మనిషి తన జీవితకాలంలో చేసిన కర్మలు (Actions) మరియు పోగు చేసుకున్న వాసనలు (Impressions/Tendencies) ద్వారా ఆత్మ యొక్క స్వచ్ఛత నిర్ణయించబడుతుంది. పుణ్య కర్మలు మరియు జ్ఞానాన్ని పొందిన ఆత్మలు ఉన్నత లోకాలను (స్వర్గం వంటివి) లేదా ఉన్నత చైతన్య స్థాయిలను చేరుకుంటాయని చెబుతారు. దీనినే ఉన్నత లోకాలలో ప్రయాణం అని కూడా అంటారు. మేఘాల పోలిక (Analogy of Clouds) :

మేఘాలు వాటి సాంద్రత (Density), తేమ (Humidity) మరియు ఉష్ణోగ్రత (Temperature) వంటి వాటి సహజ లక్షణాల ఆధారంగా వివిధ ఎత్తుల్లో ఎలా స్థిరపడతాయో, అదేవిధంగా, ఆత్మ తన కర్మల నాణ్యత (Quality of Karma), పుణ్యం (Merit), మరియు జ్ఞానం (Knowledge) అనే లక్షణాల ఆధారంగా, అంతరిక్షంలోని ఉన్నత చైతన్య లోకాలలో తన స్థానాన్ని పొందుతుందని ఈ వివరణ యొక్క సారాంశం.

మోక్షం (%Moksha/Liberation) :

మోక్షం అనేది అత్యున్నత చైతన్య స్థాయి. అంటే, ఆత్మ కర్మ బంధాల నుండి పూర్తిగా విముక్తి పొంది, పునర్జన్మ చక్రం (Samsara) నుండి బయటపడి, పరమాత్మలో (Supreme Soul) ఐక్యమవుతుంది. ఈ పోలిక "పూర్తిగా నీలి ఆకాశం" వంటిది కావచ్చు. మరణానంతరం ఆత్మ తన కర్మ మరియు సంస్కారాల బరువు/స్వచ్ఛత ఆధారంగా, ఆకాశంలో మేఘాలు వేర్వేరు స్థానాల్లో ఉండేలా, వివిధ చైతన్య లోకాలను చేరుకుంటుంది.




# భారత మాజీ ఉప రాష్ట్రప ఎం. వెంకయ్యనాయుడు కడప జిల్లా పర్యటన విశేషాలు






**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా.. ఆదివారం ఉదయం సిపి బ్రౌన్ బాషా పరిశోధనాకేంద్ర గ్రంధాలయాన్ని సందర్శించిన భారత మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఎం. వెంకయ్యనాయుడు. ముందుగా సిపి బ్రౌన్ భాషాపరిశోధన కేంద్ర గ్రంథాలయ భవనంలోని జనుమద్ది సాహితీ పీఠం, గ్రంథాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి గ్రంథ పరిమళాన్ని ఆస్వాదించిన ఎం. వెంకయ్యనాయుడు గారు. స్వర్గీయ డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు ఎంతో శ్రమపడి, సహృదయుల సహకారంతో కడపలో నిర్మించిన సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం, భాష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం ఆనందదాయకం. గ్రంథాలయంలోని అరుదైన పుస్తకాలను చూడడం ఎంతో సంతోషాన్ని పంచింది. 50 వేలకు పైగా పుస్తకాలతో పాటు, 200 తాళపత్ర గ్రంథాలను సేకరించి, శుద్ధి చేసి, స్కాన్ చేసి భద్రపరచిన నిర్వహణా బృందం చొరవను అభినందిస్తున్నాను. ఇంత చక్కని కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని.. యువతరం, తెలుగు భాష ప్రేమికులు ఒకసారి ఈ గ్రంథాలయాన్ని సందర్శించాలని సూచించిన వెంకయ్యనాయుడు. అనంతరం డా. జనుమద్ది హనుమచ్ఛాస్త్రి "బ్రౌన్ శాస్త్రి" గారి శత జయంత్యుత్సవం (1925-2025) సందర్భంగా 14వ సాహిత్య మరియు గ్రంథాసల్య సేవా పురస్కారాల ప్రదానోత్సవాల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరైన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డా. జస్టిస్ వెంకట జ్యోతీర్మయి ప్రతాప, సభ అధ్యక్షులుగా హాజరైన కేంద్ర సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అతుధులుగా హాజరైన వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.

ఈ సందర్భంగా సభకు హాజరైన వారితో.. తెలుగు భాష ఔన్నత్యం, తెలుగు భాష తీయదనం, కడప జిల్లా కళా సాహిత్య విశిష్టతను పంచుకున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.

ఒక ఊదేశీయుడు మన రాష్ట్రానికి వచ్చి మాతృ బాషా తెలుగు భాషకు కృషిచేసిన మహోన్నతుడికి శతకోటి అభినందనలు తెలియజేసిన వెంకయ్యనాయుడు. తెలుగు సాహితీ ప్రాపంచంలో తనదైన శైలిని, ముద్రను వేసుకున్న అవార్డు గాహీతలు గుమ్మడి గోపాలకృష్ణ, మెడసాని మోహన్ గారి సేవలకు అభినందనీయం. పుస్తకాల పురుగుగా, గ్రంథాలయంలో వేలాది పుస్తకాలను నెలకొల్పిన అంకె గౌడ్ గారికి శత కోటి ధన్యవాదాలు. ప్రతి ఊరికి ఒక దేవాలయం, విద్యాలయం, సేవలయం, గ్రంథాలయం నెలకొల్పేలా.. సమాజంలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చిన వెంకయ్యనాయుడు. దేశ సమైఖ్యతకు, దేశ అభివృద్ధికి, దేశ విలువలను కాపాడడంలో.. నేటి యువత కీలక పాత్ర పోషించాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చిన వెంకయ్యనాయుడు. మనం అడగకుండానే.. మనతో సహజీవనం చేస్తున్న ప్రకృతిని ఎప్పుడు కాపాడాలి, ప్రకృతితో మమేకమై బ్రతకాలి. ప్రకృతిని కాపాడాలని సూచించిన వెంకయ్యనాయుడు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని, విద్యా వికాశంతో పాటు యోగా, క్రీడలు, కళలు, సాహిత్యం, మానసిక వికాసంపై దృష్టి సారించాలని హితవు పలికిన వెంకయ్యనాయుడు. మన కట్టుబొట్టు, మన సంస్కృతి సంప్రదాయాలు, మన వేశాభాషలు, మన యాస.. కు కాపాడుకోవడం ముఖ్యం అని సూచించిన వెంకయ్యనాయుడు. దృష్యం స్పందనకు నాంది, స్పందన ఆలోచనకు నాంది, ఆలోచన ఒక వ్యక్తీకరణ, భాషకు, ఆవిష్కరణకు నాంది.. మాట పడకుండా మనిషిగా మనుగడ సాగించాలని అని విద్యార్థులకు సూచించిన వెంకయ్యనాయుడు. మాతృ భాషలో పత్యంశాలు, పరిపాలన ఉత్తర్వులు, ప్రత్యుత్తరాలు సాగాలి, న్యాయ మూర్తులు కూడా తమ వాదనలను తెలుగులోనే వాదించాలని విన్నపం తెలియజేసిన వెంకయ్యనాయుడు. ఇతర భాషలను గౌరవించాలి కానీ.. ఇతర భాషా దురభిమానం పనికిరాదని సూచిస్తూ.. మాతృభాషను మరువ రాదు, సమాజంలో రోజువారీ దిన చర్యలో భాగంగా.. ప్రతి సూచికాలను మాతృ బాషనే అమలు చేయాలని కోరిన వెంకయ్యనాయుడు. సామాజిక మాధ్యమాలు, సాంకేతిక విద్య స్వదేశీ భాషలోనే అందివ్వాలని... సూచిస్తూ, మన దేశ ప్రధాని కూడా ఉన్నత విద్యను స్వదేశీ భాషలోనే.. విద్యను అందించేలా సమలోచనలో ఉన్నారని... తెలిపిన వెంకయ్య నాయుడు. మాటతీరు, మర్యాద మనన్నలు, పెద్దలంటే గౌరవం, ఆరోగ్యకరమైన భారతీయ ఆహారపు అలవాట్లను అవలంభించాలని సూచించిన వెంకయ్యనాయుడు. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయాలి, ప్రతి ఒక్కరూ.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని కేటాయించాలి. ప్రేమనుబంధాలను బలపరుచుకోవాలి, అనురాగం పెంపొందించాలి. సమాజంలో స్నేహ భావాన్ని పెంపొందించాలి. ఈర్ష్య ద్వేషాలను పక్కన పెట్టి.. ఆప్యాయత, అనురాగాలను పెంపొందించాలని.. విద్యార్థులకు హితోపదేశం చేసిన వెంకయ్యనాయుడు. తెలుగు జాతికి విశిష్ట సేవలను అందిస్తున్న సిపి బ్రౌన్ భాష పరిశోధన కేంద్ర గ్రంథాలయ అభివృద్ధిని కొరుతూ.. తన కుమార్తె నిర్వహిస్తున్న స్వర్ణ భారతీ ట్రస్ట్ నుండి.. రూ.5 లక్షల విరాళంను ప్రకటించిన వెంకయ్యనాయుడు.కార్యక్రమానికి హాజరైన జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ళ ఆదినారాయణ రెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, వైఎస్ఆర్ కడప జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఒంటేరు శ్రీనివాసరెడ్డి, జానుమద్ది కుటుంబ సభ్యులు తదితరులు.

## మాతృభాష పరిరక్షణ ప్రజా ఉద్యమంగా రూపు దాల్చాలి

(మొదటి పేజీ తరువాయి) డా. మేడసాని మోహన్, సాహిత్యవేత్త శ్రీ రేవూరు అనంత పద్మనాభ రావు, 20 లక్షల పుస్తకాలతో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న శ్రీ అంకే గౌడ గారికి పురస్కారాలు ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఊరిలో గ్రంథాలయం, దేవాలయం, సేవాలయం (స్వచ్ఛంద సేవా సంస్థ) ఏర్పడాలన్నది తన ఆకాంక్ష అని, ప్రజలు ఈ దిశగా చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప (న్యాయమూర్తి), ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి (సాహితీవేత్త), డా. శ్రీధర్ చెరుకూరి (జిల్లా కలెక్టర్), ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ (ఉపకులపతి, యోగివేమన విశ్వవిద్యాలయం), శ్రీ జానమద్ది విజయభాస్కర్ (సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ), పట్టణ ప్రముఖులు, జానమద్ది కుటుంబ సభ్యులు, భాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## నిగర్వి, నిర్మల ధర్మపరుడు 'రామ ముని రెడ్డి

(3వ పేజీ తరువాయి) నిర్మాణంలో రాము ముని రెడ్డి గారు పోషించిన పాత్ర ఘననీయమైందన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పుస్తక రచయితను ప్రశంసిస్తూ పద్యాలను ఆలపించారు. అనంతరం వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు రచయిత రామ ముని రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన స్పందిస్తూ నా పుస్తకాన్ని ఇంత చక్కగా ఆవిష్కరించి. సత్కరించిన రచయితల సంఘం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రామ ముని రెడ్డి సతీమణి కందుల లక్ష్మీదేవమ్మ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, సాహిత్య కారులు, ఆధ్యాత్మిక చింతనాపరులు పాల్గొన్నారు.

## కడపలో రెండు రోజులు పర్యటించిన మాజీ ఉప రాష్ట్రపతి




**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** కడపజిల్లా. కడప పట్టణం లో శనివారం మరియు ఆదివారం 1,2 తేది రెండు రోజులు పర్యటించిన భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి ముప్ప వరపు వెంకయ్య నాయుడు. పర్యటనలో భాగంగా శనివారం మాజీ రాష్టపతి వెంకయ్య నాయుడు ని కడప ఎయిర్పోర్ట్ లో జిల్లా ఏస్పీ షెల్కె నచికేత్ విశ్వనాధ్ ఐపీస్ మరియు జిల్లా కలెక్టర్ డా" శ్రీధర్ చెరుకూరి లు ఘనంగా స్వాగతం పలికేరు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని నూతన పరిపాలనా భవనంలో ఉన్న అన్నమయ్య సెనేట్ హాల్ లో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ యూనివర్సిటీ విద్యార్థులకు భారతదేశ ఔన్నత్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొప్పదనం, తెలుగు భాష తియ్యదనం, కడప జిల్లా కళా సాహిత్య విశిష్టతను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మరియు జిల్లా ఏస్పీలు మరియు శ్రీశైలం దేవస్థానం చేర్మెన్ పోతుంగుంట రమేష్ నాయుడు మరియు రాయచోటి టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు సుగావాసి ప్రసాద్ బాబు లు మాజీ రాష్టపతి వెంకయ్య నాయుడు ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు మరియు భారతీయ జనత పార్టీ, తెలుగుదేశం, జనసేనా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్నేహం ఫౌండేషన్ .. 500 సేవా కార్యక్రమాలు : ఫౌండర్ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న




**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** కడప నగరంలో నెలకొని ఉన్న చిరకాల ఆప్తులు స్నేహం ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న పెన్ పవర్ దినపత్రిక రీజినల్ కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి తో మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరముల నుండి ఇప్పటివరకు 500 సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఆ సంస్థ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ మాట్లాడుతూ కడప కడప లో వరదల సమయంలో, కరోనా సమయంలో, పట్టణంలోని అన్ని వృద్ధాశ్రమాలకు నిత్య అన్నదాన సేవా కార్యక్రమాలు, వస్త్ర దాన కార్యక్రమాలు, దీనస్థితిలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటూ కడప నగరంలోనే కాకుండా రాయలసీమ జిల్లాలలో తమదైన శైలిలో ప్రతి స్వచ్ఛంద సేవా సంస్థను పలకరిస్తూ తామన్నామంటూ భాస్కర్ లక్ష్మీప్రసన్న ప్రతి స్వచ్ఛంద సేవా సంస్థకు నెల నెల 20 వేలకు తక్కువ కాకుండా సేవా కార్యక్రమాలు, సైబర్ క్రైమ్స్, కళాశాలలోనూ, పాఠశాలల్లో అనేక అవగాహన కార్యక్రమాలు, వీధి బాలల హక్కున చేర్చుకుని వారిని వివిధ పాఠశాలల్లో చేర్పిస్తూ, స్వచ్ఛంద సేవా సంస్థలలో ఉన్నటువంటి చిన్నారులకు పుస్తకాలు, దుస్తులు, దుప్పట్లు, అవసరమైనటువంటి సరుకులు, మొత్తం తొమ్మిది సంవత్సరాల కాలంలో 500 కార్యక్రమాలు, అనేక వందల అవగాహన కార్యక్రమాలు, నిర్వహించడం జరిగినదని పెన్ పవర్ దినపత్రిక రాయలసీమ కోఆర్డినేటర్ తో విషయాలు పంచుకున్నారు. రానన్న రోజులలో భారీ ఎత్తున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భాస్కర్ తెలియజేశారు.













# నిగర్వి, నిర్మల ధర్మపరుడు 'రామ ముని రెడ్డి' : ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** మారుమూల గ్రామం సామాన్య రైతు కుటుంబం లో పుట్టి అంచలంచెలుగా ఎదిగి 1983లో కడప శాసనసభకు పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిచి కేవలం 32 సంవత్సరాల వయసులోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన నిగర్వి, నిర్మల ధర్మపరుడు శిరిగిరెడ్డి రామ ముని రెడ్డి అని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక కడప పట్టణం ద్వారకా నగర్ లో ఉన్న శ్రీకృష్ణాలయం సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైయస్సార్ కడప జిల్లాల రచయితల సంఘం ఆధ్వర్యంలో రామ ముని రెడ్డి రచించిన స్వీయ చరిత్ర నా స్మృతి పథంలో... పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ స్వీయ చరిత్ర రాయడం కత్తి మీద సాము లాంటిదని, అయితే రామ ముని రెడ్డి చాలా జాగ్రత్తగా రాశారని, ఆయన జీవితం లో ఏదైతే చేశారో అది మాత్రమే రాశారని, నేటి యువతకు ఇలాంటి పుస్తకాలు మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయన్నారు. ముఖ్య అతిథిగా డాక్టర్ విద్వాన్ గానుగపెంటరావు ప్రసంగిస్తూ రాము ముని రెడ్డి నాకు గత 40 సంవత్సరాల నుండి పరిచయమని, నిర్దిష్టమైన ఆశయాలతో, నిస్వార్ధ ప్రజా సేవకునిగా పేరు తెచ్చుకున్నారన్నారు. డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి పుస్తక సమీక్ష చేస్తూ రామ ముని రెడ్డి బాల్యం నుండి తన జీవితంలో జరిగిన ప్రధాన సంఘటనలను సామాన్యులకు కూడా అర్థమయ్యే తీరులో రాశారని, ఆయన చిన్నప్పటినుండి సేకరించిన సూక్తులను కూడా ఈ పుస్తకలో ప్రచురించడం ముదావాహమన్నారు. విశిష్ట అతిథిగా డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ రామ మునిరెడ్డి రాజకీయాల నుండి విరమించి పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో జీవితాన్ని గడపడం ఆయన ఉన్నతమైన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. మరో విశిష్ట అతిథి డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి తన ప్రసంగంలో ఈ స్వీయ చరిత్ర ద్వారా ఆయన చేసిన అనేక మంచి కార్యక్రమాలు వెలుగులోకి రావడం శుభ పరిణామన్నారు. ఆత్మీయ అతిథిగా డాక్టర్ పొదిలి నాగరాజు మాట్లాడుతూ 1993లో సుందర చైతన్య స్వామి వారిని కడపకు ఆహ్వానించి ఆయనతో 18 రోజులు గీతా జ్ఞాన యజ్ఞం చేయించిన ఘనత ఆయనదేనన్నారు. మరో ఆత్మీయ అతిథి భూమిరెడ్డి స్వరూపారాణి మాట్లాడుతూ ఈరోజు కడపలో ఇంత అద్భుతమైన శ్రీకృష్ణాలయ నిర్మాణంలో రాము ముని రెడ్డి గారు పోషించిన పాత్ర ఘననీయమైందన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి పుస్తక రచయితను ప్రశంసిస్తూ పద్యాలను ఆలపించారు. అనంతరం వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు రచయిత రామ ముని రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన స్పందిస్తూ నా పుస్తకాన్ని ఇంత చక్కగా ఆవిష్కరించి. సత్కరించిన రచయితల సంఘం వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రామ ముని రెడ్డి సతీమణి కందుల లక్ష్మీదేవమ్మ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, సాహిత్యకారులు, ఆధ్యాత్మిక చింతనాపరులు పాల్గొన్నారు.

## ప్రయోగాత్మక విద్యలో వైవియు వృక్షశాస్త్ర శాఖ




**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** యోగివేమన విశ్వవిద్యాలయం, వృక్షశాస్త్ర శాఖ తరగతిలో బోధించడం మే కాకుండా విద్యార్థుల క్షేత్ర సందర్శనతో ఆచరణాత్మకంగా బోధించే విధానాన్ని అనుసరిస్తోంది. ఆ శాఖ విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్ర ఓబుల రెడ్డి, ప్రొఫెసర్ ఏ మధుసూదన్ రెడ్డి ల పర్యవేక్షణలో కోయంబత్తూర్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ను విద్యార్థులు సందర్శించారు. ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్, దోబబెట్ట, ఔషధ మొక్కల అభివృద్ధి ప్రాంతం, పైన్ ఫారెస్ట్ ల్లోకి వెళ్లి మొక్కల గురించి , ప్రయోగాత్మక విధానాల గురించి అవగాహన పొందారు. అరుదైన మొక్కలను సేకరించి, నమోదు చేసుకున్నారు. ఐదు రోజుల బొటానికల్ టూర్ తమకెంతో జ్ఞానాన్ని ఇచ్చిందని విద్యార్థులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వృక్షశాస్త్ర అధ్యాపకులకు వైవియూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్యులు చంద్రబాబు రెడ్డి, మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రత్యక్ష జ్ఞానము పరిశోధనల దృష్టి వైపు తీసుకెళుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఏటా విద్యార్థులకు బొటానికల్ టూర్ నిర్వహిస్తున్నామని తెలిపారు.


## వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడంపై వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం





**చింతకొమ్మదిన్నె పెన్ పవర్ నవంబర్ 2 :** చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలపల్లె, పంచాయతీ లో,బుగ్గలేటిపల్లె,లొ రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో గూడా ప్రభాకర్ రెడ్డి పరిశీలకులు: నీలఖంతారెడ్డి,రామచంద్రయాదవ్, గూడా సదానంద రెడ్డి,గజ్జల, లక్ష్మిరెడ్డి, కత్తి, సుబ్బరాయుడు,బత్తల సుబ్బరాయుడు,బొల్లిశెట్టి హరీష గ్రామ ముఖ్య నాయకులు మరియు పెద్ద ఎత్తున గ్రామప్రజలు, మహిళలు,పాల్గొన్నారు.




## మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

# చేతులుమీదుగా పుస్తకావిష్కరణ

### (డా.చింతకుంట శివారెడ్డి... అలనాటి జ్ఞాపకాలు' పుస్తకం)






**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సహాయ పరిశోధకుడిగా పనిచేస్తున్న డా.చింతకంట శివారెడ్డి రాసిన 'కడపజిల్లా స్వాతంత్ర్య సమర యోధులు : అలనాటి జ్ఞాపకాలు' పుస్తకాన్ని భాతర పూర్వ ఉప రాష్ట్రపతి మొప్పవరపు వెంకయ్య నాయుడు ఆదివారం బ్రౌన్ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి జీవిత చరిత్రలను భద్రపరచడం అవసరమన్నారు. ఇలాంటి పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. అహర్నిశలు ఎంతో శ్రమించి జీవితాలర్పించిన మహనీయులు సదా స్మరణీలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానముల న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, జానమద్ది విజయభాస్కర్, ఒంటేరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా కల్చర్ యూనిట్‌లను సందర్శించిన వైవియు జంతు శాస్త్ర శాఖ విద్యార్థులు








**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) - 2020 లో భాగంగా యోగివేమన విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర శాఖ మూడో సెమిస్టర్ విద్యార్థులు నెల్లూరు హేచరీ ప్రైవేట్ లిమిటెడ్ ఆక్వాకల్చర్ చెరువులు, బీచ్ సందర్శనకు చేశారు. నైపుణ్య ప్రయోగాదారిత విద్యలో భాగంగా సి.పి.ఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ హేచరీ యూనిట్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆక్వాకల్చర్ ఈనోట్ల ఏర్పాటు దగ్గర నుంచి అక్కడ పెరుగుతున్న జీవచరాలు గురించి జంతు శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ అను ప్రసన్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో పాటు ఆ శాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంనకు అపూర్వ స్పందన





**చింతకొమ్మదిన్నె పెన్ పవర్ నవంబర్ 2 :** వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డి పల్లె పంచాయతీలో గ్రామసభ నిర్వహించబడింది. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల జోనల్ పరిశీలకులు గూడా ప్రభాకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, గత్తి రెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, సర్పంచ్ డి. సుబ్బారెడ్డి, నాయకులు రమణారెడ్డి, మోహన్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, విశ్వనాథ్ (బాబు) తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల నాయకులు గూడా సదానందరెడ్డి, నీలకంఠారెడ్డి, శ్రీరాం రెడ్డి, పంచాయతీ నాయకులు, హరిజనవాడ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






మనోబంధు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారికి వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు మహబూబ్ బాషా, శివ, అనూష తదితరులు.

## కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో మురళికి వైవియూ డాక్టరేట్



**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** ప్రొద్దుటూరు వై.ఎస్.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన బల్లి మురళికి యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ ని ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి కృష్ణారావు తెలిపారు. ప్రొఫెసర్ సి. నాగరాజు మార్గదర్శకత్వంలో "ఎన్ హాన్సింగ్ క్లాసిఫికేషన్ అక్యురసీ ఫర్ టమోటో లీఫ్ డిసీజెస్ యూజింగ్ అడ్వాన్స్ మిషన్ లెర్నింగ్ టెక్నిక్స్ " అనే అంశంపై పరిశోధనన పూర్తి చేశారు. పరిశోధనలో భాగంగా మురళి రాసిన 7 పరిశోధనా వ్యాసాలు జాతీయ మరియు అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురితమయ్యాయి. అంతర్జాతీయ సదస్సులో పోస్టర్ ప్రదర్శన చేశారు. తన పరిశోధనా కృషికి గాను, యోగి వేమన విశ్వవిద్యాలయం నిర్వహించిన నేషనల్ సైన్స్ డే లో "వైవియూ -ఎన్.ఎస్.డి యంగ్ రీసెర్చర్ అవార్డు-2023"ను అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మురళిని అధ్యాపకులు, విద్యార్థులు స్కాలర్లు అభినందించారు.

## కాశీబుగ్గ దుర్ఘటన నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ






**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** కడప నగరంలో కాశీబుగ్గలో జరిగిన దుర్ఘటనకు నిరసిస్తూ కడప నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ నుండి పొట్టి శ్రీరాములు గారి సర్కిల్ వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు కె.సురేష్ బాబు , మాజీ డిప్యూటీ సీఎం శ్రీ ఎస్. బి. అంజద్ భాషా మరియు కడప నగర ఇంచార్జ్ మేయర్ శ్రీమతి ముంతాజ్ బేగం . ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలు, కో ఆప్షన్ మెంబర్లు, అనుబంధ సంఘాల నాయకులు, నాయకురాలు, ఇతర వైఎస్ఆర్ సీపీ నాయకులు, నాయకురాలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దైవాన్ని తెలుసుకోవాలంటే?

– సివి భాస్కర్ రెడ్డి...





**కడప పెన్ పవర్ నవంబర్ 2 :** అత్యంత పురాతన కాలంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితం, రాజా జనక మహర్షి అష్టావక్రుడిని మూడు ముఖ్యమైన ప్రశ్నలు అడిగారు:

వైరాగ్యాన్ని (అనాసక్తి/నిర్లిప్తతను) ఎలా పొందగలను?

విముక్తిని (మోక్షాన్ని/లిబరేషన్‌ను) ఎలా సాధించగలను?

ఉన్నత జ్ఞానాన్ని ఎలా పొందగలను?

అష్టావక్ర మహర్షి, "ఓ మహా రాజా! ఈ లక్షణాలలో ఒకదానిని పెంపొందించుకో" అని కొన్ని గుణాలను వివరించారు. ఆయన ఐదు గుణాలను పేర్కొన్నా, ఈ రోజు మీరు చెప్పిన ఒక ముఖ్యమైన గుణం గురించి మాత్రమే ఇక్కడ వివరిస్తున్నారు.

ఆయన చెప్పిన ముఖ్యమైన గుణం:

దయ మరియు కరుణ.

సందేశం యొక్క సారాంశం

అష్టావక్ర మహర్షి సందేశం యొక్క అంతరార్థం ఏమిటంటే:

మీరు దైవాన్ని తెలుసుకోవాలంటే


బంధాల నుండి విడిపోవాలంటే

ఉన్నతమైన జ్ఞానాన్ని పొందాలంటే

అత్యంత ప్రాథమికమైన ఈ రెండు లక్షణాలను (దయ మరియు కరుణ) మీలో పెంపొందించుకోవాలి.

సాధారణంగా వైరాగ్యం, జ్ఞానం అంటే కఠినమైన సాధనలు, తపస్సు, లేదా అన్నింటినీ వదిలివేయడం అనుకుంటారు. కానీ అష్టావక్రుడు, నిజమైన విముక్తి అనేది మన మనసులో, మన అంతర్గత గుణాలలో ఉందని సూచించారు.

దయ అంటే ఇతరుల పట్ల మంచిగా ఉండటం, హాని చేయకుండా ఉండటం. కరుణ అంటే ఇతరుల బాధను చూసి చలించడం, వారికి సహాయం చేయాలనే కోరిక కలిగి ఉండటం. ఈ గుణాలు మన మనసులోని అహంకారాన్ని తగ్గిస్తాయి మరియు మనల్ని ప్రపంచంలోని ప్రతి జీవికి కలిపి ఉంచుతాయి. మనస్సు ఇతరుల సేవలో లీనమైనప్పుడు, అది స్వార్థం మరియు బంధాల నుండి వాటంతట అవే విముక్తి పొందుతుంది. ఈ విధంగా, దయ, కరుణల ద్వారా వైరాగ్యం, ఉన్నత జ్ఞానం, మోక్షం వంటి ఉన్నత స్థితులు సులభంగా, సహజంగా లభిస్తాయని అష్టావక్ర మహర్షి బోధించారు.




సంస్కృత పదమైన 'మనస్ ' అంటే "మనస్సు". "మానవుడు" అని అర్థం వచ్చే 'మనుష్య' అనే పదం 'మానస్ ' నుండి ఉద్భవించింది. మానవుడు అంటే మనస్సు కలిగి ఉన్నవాడు. మనస్సు మన గొప్ప ఆస్తి లేదా అతిపెద్ద మోసకారి కావచ్చు. అప్రమత్తత, తేలిక, సమతుల్యత, నియంత్రణ మరియు వివేచన జాగృతం కాని మనస్సు ఒక సవాలును అందిస్తుంది. అందువల్ల, మనం మనస్సుకు శిక్షణ ఇస్తాము. హార్ట్‌ఫుల్‌నెస్‌లో, మనం మూడు సాధారణ పద్ధతులతో ప్రారంభిస్తాము: ధ్యానం, క్లీనింగ్ మరియు ప్రార్థన.

# భాషా, సాహిత్య సంపద పరిరక్షణ బాధ్యత అందరిదీ..!

### సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన భారత మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఎం.వెంకయ్యనాయుడు




**కడప, పెన్ పవర్ నవంబర్ 2 :** భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత.. అందరిపై ఉందని.. భారత మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా.. ఆదివారం ఉదయం కడప సి.పి.బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని భారత మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఎం.వెంకయ్యనాయుడు సందర్శించారు. ఆయనతో పాటు.. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డా.జస్టిస్ వెంకట జ్యోతీర్మయి ప్రతాప, కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, వైవియూ విసి.ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కేంద్ర సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, శతావదానులు డా. మెడసాని మోహన్, రేవూరి అనంత పద్మనాభ గారు, 20 లక్షల పుస్తకాలను సేకరించిన అంకె గౌడ, ఆకాశవాణి పూర్వపు సంచాలకులు, గుమ్మడి గోపాలకృష్ణ గారు, ఎస్బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమ, జానుమద్ది సాహితీపీఠం నిర్వాహకులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు సిపి బ్రౌన్ భాషాపరిశోధన కేంద్ర గ్రంథాలయ భవనంలోని జనుమద్ది సాహితీ పీఠం, గ్రంథాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి గ్రంథ పరిమళాన్ని ఆస్వాదించారు. ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న.. సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రంలో.. జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్ఠించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ గారి విగ్రహాన్ని పరిశీలించిన అనంతరం.. సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు.




అంతేకాకుండాగ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను,




పలు రకాల గ్రంథాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న.. సి.పి.బ్రౌన్ బాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్సిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయంన్నారు. ఆదరణ, ఔన్నత్యాన్ని కోల్పోయే స్థితిలో ఉన్న తెలుగు భాష సాహిత్యాన్ని.. పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం.. "చార్లెస్ ఫిలిప్ బ్రౌన్" అని ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డా. జి.పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కొత్తమాంబ అమ్మవారి పండుగలో పాల్గొన్న జనసేన నాయకులు

అమ్మవారిని దర్శించుకున్న బెహరా భాస్కరరావు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 2 :** జీవీఎంసీ 92వ వార్డు, కంపరపాలెం మేఘాద్రిగడ్డ డ్యామ్ సమీపంలో నిర్వహించిన శ్రీ కొత్తమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పండుగ వాతావరణంలో స్థానిక భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల సంక్షేమం, ప్రాంత అభివృద్ధి కోసం భాస్కరరావు అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, అట్ట శంకర్, కంపర రమణ, కంచిపాటి మురళి, కంచిపాటి శంకర్, గవర రమణ, హరి, బెహరా సత్యనారాయణ, గొడ్డు నాగరాజు, సురేష్, ఊటపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

# సింహాచలంలో జల హారతి ఉత్సవం

* కార్తీక పౌర్ణమి సందర్భంగా వైభవంగా నిర్వహణ




**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 5 :** శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈసారి విశేష ఆధ్యాత్మిక ఉత్సవాలు జరుగుతున్నాయి. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ముఖ్య దేవాలయాల్లో “జల హారతి” కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించగా, ఆ పుణ్యసందర్భంగా సింహాచల క్షేత్రంలో కూడా “పుణ్యనది హారతి ఉత్సవం” ఘనంగా నిర్వహించనున్నారు.

**వరాహ పుష్కరిణి వద్ద వైభవంగా జల హారతి..**

ఈ కార్యక్రమం నవంబర్ 5, మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతుంది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి వేదఘోషల మధ్య, ఛత్ర, చామరాలతో, భక్తుల హర్షోల్లాస నడుమ కొండదిగువ నుండి ఊరేగింపుగా బయలుదేరి శ్రీ వరాహ పుష్కరిణి వద్దకు చేరవేయబడతారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఉత్సవమూర్తులను పుష్కరిణి తీరం వద్ద వేంచేసి, షోడషోపచార పూజలు, నక్షత్రహారతి, కుంభహారతి, ఆయుర్వేద ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం ఫలములు, పానకములు నివేదించి, మహామంగళహారతితో కార్యక్రమం ముగించబడుతుంది.

**భక్తులకు ప్రత్యేక పిలుపు..**


దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత తెలియజేసిన ప్రకారం, ఈ పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా స్త్రీ, పురుష భక్తులు, పిల్లలు అందరూ పాల్గొని దీపం వెలిగించే కైంకర్యం ద్వారా స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. దీపాలు వెలిగించేందుకు కావలసిన ప్రమిదలు, వత్తులు, నూనె వంటి సామగ్రిని దేవస్థానం తరఫునే భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పుష్కరిణి తీరం వద్ద దీపారాధన అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయబడతాయి.

**కార్తీక పౌర్ణమి ప్రత్యేకత..**

కార్తీక పౌర్ణమి రోజున జల హారతి వీక్షణం అత్యంత పుణ్యప్రదమని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ రోజు నదీ తీరం వద్ద దీపం వెలిగించి ప్రార్థించిన భక్తులు అనంత పుణ్యం పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. “ఈ ఉత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి, ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించి, శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి కృపను పొందగలరని” దేవస్థానం అధికారులు కోరారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ





**జీవీఎంసీ 88వ వార్డులో సంతకాల సేకరణ**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్**

**పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 2 :** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో భాగంగా, 88వ వార్డులో పెద్దనరవ జంక్షన్ వద్ద రచ్చబండ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని 88వ వార్డు అధ్యక్షులు గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వైద్య విద్యపై ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా తమ సంతకాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ “ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం ప్రజల ఆరోగ్య హక్కులకు తీవ్రమైన ప్రమాదం. పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న వైద్య విద్యను ప్రైవేట్ రంగం ఆధీనంలోకి ఇవ్వడం అన్యాయం. ఈ సంతకాల సేకరణ ప్రతి పౌరుని స్వరం, ప్రజా వైద్య సదుపాయాల రక్షణ కోసం ఇది ప్రజల పోరాటం” అని అన్నారు. ఆయన ప్రజలకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వలన కలిగే నష్టాన్ని వివరించారు.

“ప్రభుత్వ ఆసుపత్రులు, కాలేజీలు ప్రజా ధనం మీద నిర్మించబడ్డాయి. వాటిని ప్రైవేట్ రంగానికి అప్పగించడం అంటే ప్రజా సంపదను కొందరికి బహూకరించడం వంటిదే,” అని తెలిపారు. ప్రజలు ఉత్సాహంగా పాల్గొని, ప్రభుత్వ వైద్య విద్యను కాపాడాలని నినాదాలు చేశారు.

ఈ సంతకాల సేకరణ ద్వారా ప్రతి సంతకం ప్రజా హక్కుల రక్షణకు బలమైన స్వరం అవుతుందనే సందేశాన్ని నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, 88వ వార్డు అధ్యక్షులు గండ్రెడ్డి మహాలక్ష్మి నాయుడు, మాజీ కార్పొరేటర్ చెప్పా నాగరాజు, అనకాపల్లి జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు బొడ్డపల్లి హేమంత్ కుమార్, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షులు గొర్రెపల్లి శ్రీను, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షులు చొప్ప, సీసీఎల్ అధ్యక్షులు వంగలపూడి గణేష్, బొరయ్య, గంగవర పాపారావు, నార్పిన అప్పలరాజు, మల్లా రమణ, దొడ్డి సాయి, గురుమూర్తి, వికలాంగుల నియోజకవర్గ అధ్యక్షులు పట్నాల లక్ష్మణ్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యం రైతు సాధికారిక సంస్థ ఇడి టి. బాబురావు నాయుడు





**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 2:** రాష్ట్రవ్యాప్తంగా పకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సమగ్రంగా కృషి చేస్తోందని, పకృతి పద్ధతుల్లో పండించిన పంటలకు ప్రీమియం ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇడి) టి. బాబురావు నాయుడు తెలిపారు. గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడెం కొత్తవీధి మండలంలోని దామనాపల్లి, దేవరపల్లి, పెదవలస పంచాయతీల పరిధిలో పకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేస్తున్న రైతులను ఆయన శనివారం సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పకృతి వ్యవసాయం భూమిని రసాయన కాలుష్యాల నుండి రక్షించడంతో పాటు రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని అందించే పద్ధతిగా అభివర్ణించారు. పకృతి పద్ధతుల్లో సాగు చేసే రైతులకు మార్కెటింగ్ సదుపాయాలను బలోపేతం చేయడమే లక్ష్యమని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలు రూపొందిస్తోందని ఆయన తెలిపారు. తరువాత పెదవలస పంచాయతీ టెంట్ల వీధిలో గిరిజన రైతులు రైజ్డ్ బెడ్ పద్ధతిలో సాగు చేస్తున్న పసుపు పంటలను పరిశీలించి రైతులను అభినందించారు. అనంతరం దేవరపల్లి పంచాయతీ చుట్టుగొంది గ్రామాన్ని సందర్శించి, పకృతి విధానంలో సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భనలో అల్లూరి సీతారామరాజు జిల్లా డీసీఎం భాస్కర్ రావు, గిరిజన వికాస్ సెక్రటరీ నెల్లూరు వెంకట సత్యనారాయణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ యమున, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ 90వ వార్డులో మత్స్యకారులకు అత్యవసర సహాయం

**నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన కార్పొరేటర్ బొమ్మిడి రమణ**



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, అక్టోబర్ 2 :** జీవీఎంసీ 90వ వార్డులోని మత్స్యకారులు భారీ తుఫాన్ కారణంగా నష్టపోయిన ఘటనకు సంబంధించి, వారిని సత్వర సహాయం అందించే చర్య తీసుకోబడింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచన మేరకు, మత్స్యకారులకు నిత్యావసర సరుకులు రేషన్ డిపో ద్వారా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మి మరియు ప్రాంతీయ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని, నష్టపోయిన ప్రజలకు ఆదరణనిచ్చారు. 90వ వార్డ్ కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, బొమ్మిడి రమణ ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, “ప్రతి పౌరుడికి సకాలంలో అవసరమైన సహాయం అందించడం మా ప్రధాన బాధ్యతని తెలిపారు. ఈ చర్య స్థానిక ప్రజలందరికీ ఆత్మవిశ్వాసాన్ని మరియు సమాజసేవలో ప్రభుత్వ, పార్టీ ప్రతినిధుల దృఢమైన ప్రతిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

# తుఫానుతో దెబ్బతిన్న రోడ్డు - గ్రామస్తుల శ్రమదానంతో పునరుద్ధరణ



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, నవంబర్ 2:** ”మొంథా తుఫాన్” ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా దేవరపల్లి పంచాయతీ పరిధిలోని సాగులు నుండి ఎర్ర చెరువుల వరకు ఉన్న రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. రోడ్డు కొట్టుకుపోయి పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు గ్రామస్తులు స్వయంగా ముందుకు వచ్చి శ్రమదానం ద్వారా రోడ్డును మరమ్మతు చేశారు. మట్టి, రాళ్లతో గుంతలను పూడ్చి రాకపోకలు సులభంగా జరిగేలా చేశారు. దీనిపై దేవరపల్లి ఉప సర్పంచ్ గుమ్మడి రాజు మాట్లాడుతూ “తుఫాన్ కారణంగా గ్రామ రహదారి పూర్తిగా దెబ్బతింది. అధికారుల సహాయం రాకముందే గ్రామస్తులు ఐక్యంగా శ్రమదానం చేసి రోడ్డును తిరిగి మామూలు స్థితికి తీసుకువచ్చారు. ఇది గ్రామ ఐక్యతకు ప్రతీక” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథ స్వామి మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.






**గుమ్మలక్ష్మీపురం నవంబర్.02 పెన్ పవర్.** జగన్నాథస్వామి ని దర్శించుకున్న ప్రభుత్వ విప్ మరియు బొబ్బిలి, పాలకొండ ఎమ్మెల్యేలు. కురుపాం మండలం, మొండెంఖల్లు గ్రామంలో ఆదివారం నాడు శ్రీశ్రీశ్రీ జగన్నాధస్వామి అఖండ హరినామ సంకీర్తన మహోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన పాలకొండ శాసనసభ్యుడు నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. గ్రామస్తులు వారికీ మేళా తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జగన్నాథ స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గం, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, అష్ట ఐశ్వర్యాలు కలగాలని కోరుకున్నానని అన్నారు. అనంతరం గొటివాడ పంచాయతీ, నేరేడువలస గ్రామనికి సమీపంలో ఉన్న శ్రీ మాలతమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈరోజు జరగబోయే ఇండియా వి/స్ దక్షిణాఫ్రికా ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా టీమ్ గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. వారి వెంట మండల కన్వీనర్ కె వి కొండయ్య, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, ఏఎంసీ చైర్పర్సన్ కడ్రక కళావతి, స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, మాజీ ఏఎంసీ చైర్మెన్ కోలా రంజిత్ కుమార్, రామకృష్ణ, శ్రీను, సుబ్బలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ఫ్రమ్ వైసీపీ టు టీడీపీ.. కోవూరు సమ్ థింగ్ స్పెషల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్ లో కోవూరు నియోజకవర్గంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనదైన రాజకీయంతో దూసుకుపోతున్నారని టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రతిపక్షం వైసీపీ ఇప్పట్లో కోలుకోలేని పరిస్థితి కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వైసీపీ స్వయంకృతంతోపాటు ఎమ్మెల్యే వేమిరెడ్డి వ్యవహారశైలి కోవూరు రాజకీయాలను ఆసక్తికరంగా మార్చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల కాలంలో అధికార టీడీపీలో చాలా నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు పెరిగిపోతున్నాయి. సాక్ష్యాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ గ్రూప్ వార్ పై సీరియస్ అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కోవూరు రాజకీయం కాస్త స్పెషల్ గా ఉందని విశ్లేషిస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కూటమిలో ప్రధాన పార్టీ టీడీపీ చాలా నియోజకవర్గాల్లో అంతర్గత సమస్యలను ఎదుర్కొంటోంది. దీనికి రకరకాల కారణాలు ఉన్నాయని అంటున్నారు. అందులో ప్రధానంగా మిత్రపక్షాలతో సర్దుబాటు ఒక సమస్య అయితే, ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి ఎమ్మెల్యేలైన నేతల ఒంటెద్దు పోకడలు మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలు అప్పటివరకు పార్టీలో ఉన్నవారిని తొక్కేసే విధంగా నడుచుకోవడం పలు చోట్ల వివాదాలకు కారణం అవుతోంది. ఇందుకు నెల్లూరు జిల్లాలోనే ఉన్న కావలి నియోజకవర్గాన్ని ఒక ఉదాహరణగా చూపుతున్నారు. కానీ, అదే జిల్లాలో ఉన్న కోవూరు నియోజకవర్గంలో ఇందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితులు టీడీపీ అధిష్టానానికి ఒక ఓదార్పుగా చెబుతున్నారు.కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యారు. కొత్తగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఈ మహిళా నాయకురాలు 'అమ్మ'లా అందరికీ దగ్గర అవుతున్నారని అంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు తన సొంత డబ్బుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ అందుబాటులో ఉంటున్నారు. దీంతో ప్రతిపక్షం కూడా చెల్లాచెదురైపోతోందని అంటున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందంటున్నారు.సొంత డబ్బుతో సేవ కార్యక్రమాలు చేస్తూ, అందరినీ దగ్గర చేసుకుంటున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలను ఎవరూ హర్షించడం లేదని, అప్పటి నుంచి నల్లపురెడ్డితో కలిసి తిరిగేందుకు వైసీపీ నేతలు కూడా వెనక్కి తగ్గుతున్నారని ఇటీవల ప్రచారం జరుగుతోంది. సీనియర్ నేత అయిన నల్లపురెడ్డి సహనం కోల్పోయి ప్రవర్తించడం, ఆ తర్వాత పొరపాటును సరిదిద్దుకునే ప్రయత్నం చేయకపోవడం వల్ల కోవూరులో టీడీపీ మరింత బలపడిన సంకేతాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హవా స్పష్టంగా కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీలో అందరినీ కలుపుకుని పోతున్న ప్రశాంతిరెడ్డి.. ప్రతిపక్షంలో మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డిని ఒంటరిని చేసేలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారని చెబుతున్నారు.కోవూరు నియోజకవర్గం ఒకప్పుడు నల్లపురెడ్డి కుటుంబం కంచుకోట. 1983లో ఈ నియోజకవర్గం నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక అవడంతోపాటు మంత్రిగానూ సేవలు అందించారు. ఆయన తదనంతరం కుమారుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. ఈయన కూడా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1983 నుంచి ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో 11 సార్లు ఎన్నికలు జరిగితే 8 సార్లు నల్లపురెడ్డి కుటుంబం గెలిచింది. రెండు సార్లు పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. ఇక గత ఎన్నికల్లో ప్రశాంతిరెడ్డి గెలిచారు. అప్పటినుంచి ప్రత్యేక పంథాలో ఆమె దూసుకుపోతుండటం కోవూరు రాజకీయాన్ని ఆసక్తికరంగా మార్చేస్తోందని అంటున్నారు. వైసీపీకి, నల్లపురెడ్డి కుటుంబానికి ఒకేసారి చెక్ చెప్పేలా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పావులు కదపుతుండగా, ఆమెను ఎదుర్కొనేందుకు ప్రత్యర్థులు ఎలాంటి వ్యూహాన్ని ఎంచుకుంటారనేది చూడాల్సివుందని అంటున్నారు.

# భారత నౌకాదళం మరో కీలక అడుగు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత నౌకాదళం మరో కీలక అడుగు వేయడానికి సిద్ధమవుతోంది. దేశం మూడో స్వదేశీ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌ను నిర్మించే యోచనలో ఉందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ TPCR 2025 (టెక్నాలజీ పర్స్పెక్టివ్ అండ్ కేపబిలిటీ రోడ్‌మ్యాప్) లో భాగంగా ప్రస్తావించిన ఈ ప్రాజెక్ట్‌ను "ఐఎన్‌ఎస్ విశాల్"గా పిలవనున్నారు.

**న్యూక్లియర్ శక్తితో నడిచే తొలి భారతీయ క్యారియర్**

ప్రస్తుతం సేవలందిస్తున్న ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య, ఐఎన్‌ఎస్ విక్రాంత్‌లతో పోలిస్తే, కొత్తగా ప్రతిపాదించిన ఐఎన్‌ఎస్ విశాల్ ప్రత్యేకత ఏమిటంటే ఇది న్యూక్లియర్ శక్తితో నడిచే మొదటి భారతీయ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ అవుతుంది. దీని వలన నౌక దీర్ఘకాలం ఇంధన అవసరం లేకుండానే సముద్రంలో సుదీర్ఘ మిషన్‌లను నిర్వహించగలదు.

**అధునాతన EMALS టెక్నాలజీ**

ఐఎన్‌ఎస్ విశాల్‌లో EMALS (Electromagnetic Aircraft Launch System) వ్యవస్థను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. ఈ ఆధునిక సాంకేతికతతో భారీ యుద్ధవిమానాలు, డ్రోన్లు (UAVs) ను కూడా సులభంగా లాంచ్ చేయవచ్చు. ప్రస్తుతం ఉన్న '»ski-jump విధానంతో పోలిస్తే ఇది వేగం, సామర్థ్య పరంగా విప్లవాత్మక మార్పును తెస్తుంది.

**'ఆత్మనిర్భర్ భారత్' దిశగా మరో ముందడుగు**


ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశం 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత చేరువ అవుతోంది. ఈ నౌక నిర్మాణంలో కోచిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ( ఇతర దేశీయ రక్షణ సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి. ఆధునిక నౌకా నిర్మాణ సాంకేతికతలతో భారతదేశం ప్రపంచంలో అత్యాధునిక నౌకా శక్తిగా ఎదగడం లక్ష్యంగా పెట్టుకుంది.

**మహాసముద్ర భద్రతలో వ్యూహాత్మక ప్రాధాన్యం**

భారత మహాసముద్ర ప్రాంతంలో పెరుగుతున్న సవాళ్ల దృష్ట్యా, ఐఎన్‌ఎస్ విశాల్ నౌకాదళానికి మరింత శక్తిని అందిస్తుంది. ఇది చైనా నౌకాదళం పెరుగుతున్న ప్రభావాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ రూపకల్పన, సాధ్యతా దశలో ఉంది. త్వరలోనే ప్రభుత్వ ఆమోదం, నిధుల కేటాయింపు జరిగే అవకాశముంది. ఒకసారి నిర్మాణం పూర్తయితే, ఐఎన్‌ఎస్ విశాల్ భారత్ స్వదేశీ సాంకేతికతకు, సముద్ర శక్తి సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

భారత మూడో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కేవలం ఓ యుద్ధనౌక కాదు, అది దేశం యొక్క సముద్రశక్తి వైపు దృఢసంకల్పానికి ప్రతీక. న్యూక్లియర్ శక్తి, ఆధునిక టెక్నాలజీ, స్వదేశీ ఇంజనీరింగ్ కలయికతో ఐఎన్‌ఎస్ విశాల్ భారత్ నౌకాదళ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని రాయబోతోంది.

# ఆంధ్రప్రదేశ్ లో క్రికెట్ ఫీవర్ ఏ రేంజ్ లో ఉందంటే... పిక్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో క్రికెట్ అనేది ఒక రిలీజియన్ అని అంటారు. ఈ దేశంలో క్రికెట్ ఒక క్రీడ మాత్రమే కాదు. అదొక ఎమోషన్, అదొక సెంటిమెంట్, అదొక బలం. ఇక ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ అంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దానికి రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యేలు సపోర్ట్ చేస్తూ బిగ్ స్క్రీన్లు అరేంజ్ చేస్తే.. ఇక ఆ సందడి ఏ రేంజ్ లో ఉంటుందో ఇప్పుడు ఏపీలో కనిపిస్తుంది.అవును... భారతదేశంలో క్రికెట్ క్రేజ్ అంతా ఇంతా కాదనే సంగతి తెలిసిందే. ముఖ్యమైన క్రికెట్ మ్యాచ్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా చిన్నాపెద్దా అంతా టీవీల ముందు అతుక్కుపోతారు. ఈ క్రమంలో ఇటీవల సెమీ ఫైనల్ లో ఆసిస్ పై రికార్డ్ స్థాయి విక్టరీ నమోదు చేసిన మహిళల క్రికెట్ టీం.. ఫైనల్ పై అంచనాలను అమాంతం పెంచేసింది.ఈ క్రమంలో తాజాగా దక్షిణాఫ్రికాతో ఫైనల్ లో తలపడుతుంది. టాస్ గెలిసిన టీమిండియా బ్యాటింగ్ మొదలుపెట్టింది. దేశమంతా టీవీల ముందు అతుక్కుపోయింది! అయితే ఏపీలో మాత్రం మరింత ఎక్కువ సందడి నెలకొంది. ఇందులో భాగంగా... మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ కోసం అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.టెంట్ లు వేసి, కుర్చీలు ఏర్పాటు చేసి మరీ బిగ్ స్క్రీన్లు అరేంజ్ చేయడంతో ఆ ప్రాంతాల్లో అభిమానుల కేరింతలు మార్మోగుతున్నాయి. ప్రధానంగా పెద్ద ఎత్తున మహిళలు ఈ ఫైనల్ మ్యాచ్ చూడటం కోసం బిగ్ స్క్రీన్ల ముందు కూర్చున్నారు. ఇదే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలోనూ ఏర్పాట్లు చేశారు. దీంతో.. వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ను అందరితో కలిసి చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.దీంతో... ఇలాంటి కార్యక్రమాలు ప్రజలను కలుపుతూ, క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్న మంచి ముందడుగు అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మరోవైపు వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో భారత్ విజయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకస్వరంతో ప్రార్థనలు చేస్తున్నారు. సెమీ ఫైనల్ లో ఆసిస్ పై సాధించిన స్థాయిలో సూపర్ విక్టరీ సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.ఇలా భారత్ – సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ను అంతా కలిసి ఒకేచోట కూర్చుని చూసేలా రాష్ట్రంలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి పార్టీ నేతలు బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ తరహా నిర్ణయంపై ప్రశంసలు కురుస్తున్నాయి. ఎవరింట్లో వాళ్లు కూర్చుని చూడటంతో పోలిస్తే ఇది రెట్టింపు ఉత్సాహాన్ని ఇస్తుందని అంటున్నారు.

# ట్రంప్ ప్రకటనతో సంచలనం: తజికిస్తాన్‌లోని కీలక ఎయిర్‌బేస్‌ను కోల్పోయిన భారత్




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆకస్మిక వ్యాఖ్యలు భారతదేశ వ్యూహాత్మక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయన "ఆసియా సైనిక స్థావరాలపై" చేసిన ప్రకటన, భారత్ తజికిస్తాన్‌లో కోల్పోయిన 'అయ్నా ఎయిర్‌బేస్' వ్యవహారాన్ని మరోసారి అంతర్జాతీయ దృష్టికి తెచ్చింది. ఇది కేవలం ఒక సైనిక స్థావరం కోల్పోవడం మాత్రమే కాదు.. మధ్య ఆసియాలో భారత్ తన వ్యూహాత్మక ఉనికిని కోల్పోవడంగా విశ్లేషిస్తున్నారు.

**తజికిస్తాన్‌లో భారత్ ఉనికి: ముగింపు కథ**

భారత్ 2002లో తజికిస్తాన్ రాజధాని దుషాంబే సమీపంలోని అయ్నా ఎయిర్‌బేస్‌ను ఆధునీకరించింది. ఈ ఎయిర్‌బేస్ నుంచి భారత్ కీలకమైన గూఢచార, వ్యూహాత్మక కార్యకలాపాలను నిర్వహించేది. ఇది భారత సైన్యానికి ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ సరిహద్దులపై నిఘా పెట్టేందుకు, తద్వారా పశ్చిమ సరిహద్దుల్లో భద్రతను పర్యవేక్షించేందుకు అత్యంత కీలకమైన స్థావరం. 2022లో భారత్%–%తజికిస్తాన్ ఒప్పందం గడువు ముగియడంతో, ఈ స్థావరాన్ని స్థానిక ప్రభుత్వానికి తిరిగి అప్పగించవలసి వచ్చింది. భారత్ ప్రభుత్వం దీనిని "సహజ ముగింపు"గా పేర్కొన్నప్పటికీ, అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం భిన్నంగా ఉంది.

రష్యా – చైనా నుండి వచ్చిన బలమైన భౌగోళిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే భారత్ ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అంతర్జాతీయ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. ఈ ప్రాంతంలో తమ ప్రాబల్యం తగ్గకుండా చూసుకోవాలనేది రష్యా, చైనా వ్యూహం.

**ట్రంప్ వ్యాఖ్యలతో మళ్లీ చర్చ**

డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అమెరికా విదేశీ సైనిక స్థావరాలపై వ్యాఖ్యానిస్తూ, అమెరికా తన వ్యూహాత్మక స్థావరాలను తిరిగి బలోపేతం చేస్తుందని ప్రకటించారు. ఇదే సమయంలో, భారత్ అయ్నా ఎయిర్‌బేస్ నుంచి తప్పుకున్న వార్తలు వెలుగులోకి రావడం యాదృచ్ఛికం కాదు.

విశ్లేషకుల ప్రకారం.. ట్రంప్ ప్రకటన ప్రత్యక్షంగా అయ్నా ఎయిర్‌బేస్‌ను ఉద్దేశించింది కాకపోయినా, ఈ మొత్తం పరిణామం అమెరికా%–%చైనా%–%రష్యా త్రికోణపు వ్యూహపరమైన ఆధిపత్య పోరాటంలో భారత్ మధ్యలో చిక్కుకుపోయినట్లుగా స్పష్టం చేస్తోంది. ఒక ప్రాంతంలో ఒక దేశం స్థావరాన్ని కోల్పోవడం అంటే, అక్కడ మరొక ప్రపంచ శక్తికి స్థానం బలోపేతం అవుతున్నట్లుగా భావించాలి.

**భారత్‌పై వ్యూహాత్మక ప్రభావం**

అయ్నా ఎయిర్‌బేస్‌ను కోల్పోవడం వల్ల భారత్‌కు ఏర్పడే వ్యూహాత్మక లోటు చిన్నది కాదు. తజికిస్తాన్ బేస్ ద్వారా మధ్య ఆసియాలో భారత్ పరోక్షంగా తన ఉనికిని చాటగలిగేది. ఇప్పుడు ఆ అవకాశం శాశ్వతంగా లేకుండా పోయింది, ఇది ప్రాంతీయ శక్తిగా భారత్ ప్రాధాన్యతపై ప్రభావం చూపుతుంది.

**రష్యా – చైనా బలోపేతం**

భారత్ వెనక్కి తగ్గడంతో, ఆ ప్రాంతంలో భద్రతా వ్యవహారాలపై రష్యా , చైనా ప్రభావం మరింత బలోపేతం అవుతుంది. చైనా ఇప్పటికే బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా మధ్య ఆసియాలో ఆర్థికంగా విస్తరిస్తోంది. భవిష్యత్తులో సెంట్రల్ ఏషియన్ దేశాలతో భారత్ దౌత్య, రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడం మరింత కష్టమవుతుంది.

**భవిష్యత్తు దిశ**

వ్యూహాత్మక లోటు ఏర్పడినప్పటికీ, భారత్ ఇకపై తన భవిష్యత్తు రక్షణ, విదేశాంగ దిశను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. భారత్ ఇప్పుడు మధ్య ఆసియా దేశాలతో ఆర్థిక , దౌత్య సంబంధాలు బలోపేతం చేయడంపై దృష్టి సారించే అవకాశం ఉంది. పశ్చిమ ఆసియాలో తన సైనిక, గూఢచార ఉనికిని బలోపేతం చేయడం ద్వారా వ్యూహాత్మక సమతుల్యత సాధించే ప్రయత్నం చేయవచ్చు.

"భారత్ తజికిస్తాన్ ఎయిర్‌బేస్‌ను కోల్పోయింది" అనేది కేవలం ఒక సైనిక స్థావరం కోల్పోవడం కాదు. ఇది భౌగోళిక రాజకీయాల్లో మారిన శక్తి సమతుల్యతకు నిదర్శనం. ట్రంప్ చేసిన ప్రకటన ఈ ఘటనకు కొత్త అంతర్జాతీయ రాజకీయ రంగు పూసింది. ఈ కీలకమైన వ్యూహాత్మక లోటును భారత్ తన భవిష్యత్తు దౌత్య, రక్షణ వ్యూహాలలో ఎలా భర్తీ చేస్తుందో చూడాలి.

# ఆ దుర్ఘటన వెనుక.. ఉచిత బస్సు రద్దీ కూడా?



**హైదరాబాద్ పెన్ పవర్:** కార్తీక ఏకాదశి సందర్భంగా శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో చోటుచేసుకున్న తొక్కిసలాటకు దారితీసిన కారణాలు విస్తు గొలుపుతున్నాయి. ముఖ్యంగా ఆలయ నిర్వహణలో వైఫల్యమే తొక్కిసలాటకు దారితీసిందని చెబుతున్నప్పటికీ, ఊహించని స్థాయిలో భక్తులు రావడానికి ఉచిత బస్సు కూడా ఓ కారణంగా విశ్లేషిస్తున్నారు. సాధారణంగా ఈ ఆలయానికి రోజుకు రెండు నుంచి మూడు వేల మంది భక్తులు మాత్రమే వస్తారని, కానీ శనివారం ఒకేసారి 25 వేల మంది భక్తులు తరలిరావడానికి ఫ్రీ బస్సు ప్రధాన పాత్ర పోషించిందనే చర్చ జరుగుతోంది.

శనివారం కాశీబుగ్గ ఆలయంలో యథావిధిగా పూజలు జరుగగా, ఉదయం 9 గంటల వరకు పెద్దగా రద్దీ లేదని స్థానికులు చెబుతున్నారు. కానీ అనూహ్యంగా ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో భక్తుల సంఖ్య అమాంతం పెరిగిపోయింది. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలు చుట్టూ గ్రామీణ ప్రాంతాలే ఎక్కువ. దీంతో ఉదయం 7 గంటల తర్వాత బస్సు సర్వీసులు అందుబాటులోకి వచ్చిన తర్వాత కాశీబుగ్గ చేరుకోడానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారని, అందరూ 9–10 గంటల మధ్యలో రావడంతో ఒకేసారి రద్దీ పెరిగిపోయిందని స్థానికులు వివరిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి కాశీబుగ్గకు మధ్య దాదాపు 80 కిలోమీటర్ల దూరం ఉంటుంది. జాతీయ రహదారికి అనుకుని ఉన్న

ఈ చిన్న పట్టణానికి చుట్టుపక్కల సుమారు 10 మండలాలు ఉన్నాయి. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలకు పలాస కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ నుంచి సుమారు పది మండలాలకు బస్సు సర్వీసులు విరివిగా ఉన్నాయి. దీంతో ఉచిత బస్సు పథకం అమలులోకి వచ్చిన తర్వాత మహిళలు గుడులు, గోపురాలకు దర్శనం కోసం రావడం ఎక్కువైందని అంటున్నారు.

శనివారం కూడా కాశీబుగ్గ ఆలయానికి ఇదే మాదిరిగా వేల మంది మహిళా భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన వారిలో మెజార్టీ సంఖ్యలో మహిళలే కనిపించారు. అందుకే ప్రాణాలు కోల్పోయిన వారిలో అందరూ మహిళలే ఉన్నారని అంటున్నారు. కొత్తగా కట్టిన ఆలయం కావడం, బస్సు సర్వీసులు అందుబాటులో ఉండటం వల్ల భక్తులు భారీగా తరలివచ్చారని అంటున్నారు. ఆలయంలో అద్భుతమైన శిల్పకలతోపాటు వెంకటేశ్వర స్వామి, శివుడు, దశావతరాలు ఇలా పలు దేవతామూర్తులను ప్రతిష్ఠించడం వల్ల కూడా భక్తులు భారీగా తరలిరావడానికి ఓ కారణంగా చెబుతున్నారు.

# సౌతాఫ్రికాదే టాస్.. వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా ఫస్ట్ బ్యాటింగ్





**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల వరల్డ్ కప్ లో ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య ఆదివారం (నవంబర్ 2) ఫైనల్ ప్రారంభమైంది. ముంబైలోని డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో సౌతాఫ్రికా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ లో ఇండియా, సౌతాఫ్రికా ఎలాంటి మార్పులు చేయలేదు. సెమీస్ లో ఆడిన ప్లేయింగ్ 11 తో ఇరు జట్లు ఫైనల్ ఆడబోతున్నాయి. వర్షం కారణంగా 2:30 నిమిషాలకు పడాల్సిన టాస్ 4:30కు వేశారు. మ్యాచ్ సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది. ఓవర్లను కుదించలేదు. 50 ఓవర్ల మ్యాచ్ జరగనుంది. దశాబ్దాలుగా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని గెలిచేందుకు.. తమ కలను సాకారం చేసుకునేందుకు ఇండియా విమెన్స్ క్రికెట్ టీమ్ సిద్ధమైంది. 2005, 2017, 2020 (టీ20 కప్)లో ఫైనల్ గడపదాకా వచ్చి.. చివరి మెట్టుపై బోల్తా పడ్డారు. ప్రతిసారీ అభిమానుల గుండె నిరాశతో మూగబోయింది. దశాబ్దాలుగా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీ ఇప్పుడు ఒక్క అడుగు

దూరంలో ఉంది. అత్యంత బలమైన ఆస్ట్రేలియాను సెమీఫైనల్లోనే రఫ్ఫాడించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సైన్యం.. క్రికెట్ ప్రపంచం మొత్తం ఎదురుచూస్తున్న మెగా ఫైనల్‌కు సిద్ధమైంది.

**భారత మహిళలు (ప్లేయింగ్ XI):** షఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమంజోత్ కౌర్, రాధా యాదవ్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, రేణుకా సింగ్ ఠాకూర్

**దక్షిణాఫ్రికా మహిళలు (ప్లేయింగ్ XI):** లారా వోల్వార్ట్(కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, అన్నేకే బాష్, సునే లూస్, మారిజానే కాప్, సినాలో జాఫ్తా (వికెట్ కీపర్), అన్నరీ డెర్క్సెన్, క్లో ట్రయాన్, నాడిన్ డి క్లెర్క్, అయాబొంగా ఖాకా, నాన్‌కులులేకో మ్లాబా

# మూడో టీ20లో భారత్ ఘన విజయం.. ఆసీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపు!

**187 పరుగుల భారీ లక్ష్యాన్ని 18.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్**

**23 బంతుల్లో 49 పరుగులు చేసిన వాషింగ్టన్ సుందర్**


**5 వికెట్ల తేడాతో గెలిచి సత్తా చాటిన టీమిండియా**

**సిరీస్ 1-1తో సమం**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయం సాధించింది. ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 187 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 49 నాటౌట్) చెలరేగగా, జితేష్ శర్మ (13 బంతుల్లో 22 నాటౌట్) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి మెరుపులతో భారత్ మరో 9 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. హోబర్ట్‌లోని బెల్లెరైవ్ ఓవల్ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఆరంభంలో వికెట్లు కోల్పోయి తడబడిన ఆసీస్‌ను టిమ్ డేవిడ్ (38 బంతుల్లో 74), మార్కస్ స్టోయినిస్ (39 బంతుల్లో 64) ఆదుకున్నారు. వీరిద్దరూ అద్భుతమైన హాఫ్ సెంచరీలతో జట్టుకు భారీ స్కోరు అందించారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ 3 వికెట్లతో రాణించగా, వరుణ్ చక్రవర్తి రెండు వికెట్లు పడగొట్టాడు.అనంతరం 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు మంచి ఆరంభం లభించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (25), శుభ్‌మన్ గిల్ (15) వేగంగా ఆడారు. ఆ తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24), తిలక్ వర్మ (29), అక్షర్ పటేల్ (17) తమ వంతు సహకారం అందించారు. కీలక సమయంలో వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ ఆరో వికెట్‌కు అజేయంగా 43 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ మూడు వికెట్లు తీసినప్పటికీ, మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు.ఈ విజయంతో ఐదు మ్యాచ్ ల సిరీస్ ను భారత్ 1-1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే నవంబరు 6న గోల్డ్ కోస్ట్ లో జరగనుంది.

# గిల్ క్లాసికల్ బౌండరీ.. సంతోషంతో స్టాండ్స్‌లో సారా చప్పట్లు.. నెక్ట్స్ బాల్‌కే ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్, టీమిండియా వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ ప్రేమాయణం మరోసారి వార్తల్లో నిలిచింది. ఇప్పటికే వీరిద్దరి ప్రేమ నిజమో..! అబద్ధమో! తెలియక అభిమానులు తలలు పట్టుకుంటుంటే తాజాగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో గిల్ ఆడుతుంటే సారా పట్టలేని సంతోషంతో చప్పట్లు కొడుతున్న వీడియో వైరల్ అవుతోంది. ఎల్లిస్ వేసిన ఆరో ఓవర్ తొలి బంతికి రెండు పరుగులు రాబట్టిన గిల్ రెండో బంతికి లాంగాఫ్ లో ఒక చూడ చక్కని బౌండరీ బాదాడు. గిల్ ఫోర్ కొట్టడడంతో వంటనే కెమెరా సారా టెండూల్కర్ వైపు చూపించారు. సారా సంతోషంతో చప్పట్లు కొడుతూ కనిపించింది. సారా స్టాండ్స్ లో కూర్చొని మ్యాచ్ కు రావడమే ఆశ్చర్యానికి గురి చేస్తే.. గిల్ బ్యాటింగ్ కోసమే వచ్చిందనే వాదనలు కూడా ఉన్నాయి. ఈ ఓవర్ లో ఆ తర్వాత బంతికే గిల్ ఎల్బీడబ్ల్యూ రూపంలో ఔటయ్యాడు. ఎల్లిస్ వేసిన స్లో డెలివరీ యార్కర్ ఆడే క్రమంలో టైమింగ్ మిస్ కావడంతో బంతి ప్యాడ్లకు తగిలింది. ఆసీస్ ఆటగాళ్లు అప్పీల్ చేయడంతో అంపైర్ ఔటిచ్చాడు. ఇండియా రివ్యూ తీసుకున్నా ఫలిత,ఎం లేకుండా పోయింది. శుభమాన్ ప్రస్తుతం జరుగుతున్న ఆస్ట్రేలియా పర్యటనలో విఫలమవుతున్నాడు. వన్డే సిరీస్ లో ఘోరంగా విఫలం కాగా.. టీ20 ఫార్మాట్ లోనూ బ్యాట్ కు ఇంకా పని చెప్పలేదు.ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఆదివారం (నవంబర్ 2) హెూబర్ట్ వేదికగా బెల్లెరివ్ ఓవల్ లో జరిగిన హాయ్ స్కోరింగ్ మ్యాచ్ లో టీమిండియా 5 వికెట్ల తేడాతో విజయం సాధించి ఆతిధ్య ఆస్ట్రేలియాకు షాక్ ఇచ్చింది. భారీ ఛేజింగ్ లో వాషింగ్ టన్ సుందర్ (23 బంతుల్లో 49: 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుత క్యామియోతో పాటు మిగిలిన టీమిండియా బ్యాటర్లు తలో చేయి వేసి జట్టుకు విజయాన్ని అందించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేజింగ్ లో ఇండియా 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసి గెలిచింది.

# జాక్ పాట్ కొట్టిన రష్మిక.. ఏకంగా డబుల్!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న, కన్నడ హీరో దీక్షిత్ శెట్టి కాంబినేషన్లో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం ది గర్ల్ ఫ్రెండ్. నవంబర్ 7వ తేదీన తెలుగు , హిందీ భాషలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. నవంబర్ 14న తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కాబోతున్న నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటున్నారు చిత్ర బృందం. అయితే ఈసారి ఏకంగా కనీ వినీ ఎరుగని రీతిలో ఈ చిత్ర నిర్మాతలు సినిమా గురించి, సినిమాలో హైలెట్ గా నిలిచిన అంశాల గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు. మరి వారి మాటల్లోనే ఈ సినిమా హైలెట్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.




**ది గర్ల్ ఫ్రెండ్ నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ..**

కోవిడ్ 19 సమయంలో థియేటర్లు క్లోజ్ అయ్యాయి. అయితే ఆ తరువాత థియేటర్స్ అన్ని అందుబాటులోకి వచ్చాయి. అప్పుడే స్క్రిప్ట్ డెవలప్ చేసే పనిలో పడ్డాం. ఈ ప్రాజెక్టు తీసుకున్నప్పటి నుంచి థియేటర్ గానే వెళ్లేందుకు ప్లాన్ చేసాము. ప్రొడ్యూసర్ గా.. కమర్షియల్ గా మూవీ ఉండాలని కోరుకుంటాం కదా.. మేము రిస్క్ చేసినా పర్వాలేదు. స్టోరీ బాగుండాలి అనే నమ్మాను. మేము అనుకున్న దానికంటే స్టోరీ మమ్మల్ని మెప్పించింది.విద్యాతో కూడా నాకు మంచి స్నేహబంధం ఏర్పడింది. నిర్మాణ వ్యయంలో పూర్తి నిర్ణయం తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడలేదు. లవ్ స్టోరీస్ ను ఎవరో ఒకరి పాయింట్ ఆఫ్ వ్యూలో చెప్పాలి. అయితే ఈ కథ హీరోయిన్ కోణంలోనే ఉంటుంది. అందుకే స్టార్స్ ని ఇందులో హీరోగా తీసుకోలేదు. పర్ఫామెన్స్ ని మెయిన్ గా తీసుకొని దీక్షిత్ తీసుకున్నాము. దీక్షిత్ చాలా మంచి పెర్ఫార్మర్ ఈ ఏజ్ గ్రూప్ వాళ్ళను కూడా నటించేలా ఆకట్టుకున్నాడు.థియేట్రికల్ గా ఈ సినిమా చాలా బాగా వర్క్ అవుట్ అవుతుందని నమ్ముతున్నాము. అటు దీక్షిత్ ను తీసుకోవడం వల్ల కన్నడ మార్కెట్ కు కూడా ఉపయోగపడుతుందని మేము అనుకోలేదు. ఆయన పాత్రకు ఆయన కరెక్ట్ గా సెట్ అవుతాడనే తీసుకున్నాము. అయితే రష్మిక , దీక్షిత్ కలిసి ఇందులో నటించడం వల్లే మాకు కన్నడలో కూడా అడ్వాంటేజ్ ఏర్పడింది.ఈ సినిమాకు రాహుల్ రవీంద్రన్ గతంలో చేసిన ప్రాజెక్టులు కాకుండా ఇప్పుడు కథ చూసి మేము ఆయన సినిమాను నిర్మించాము. రష్మిక ఈ సినిమాకు రెమ్యూనరేషన్ తీసుకోలేదు. కాబట్టి ఆ కృతజ్ఞతతోనే ఆమెకు రెట్టింపు పారితోషకం ఇస్తున్నాం. అను ఇమ్మానుయేల్ కూడా చాలా అద్భుతంగా నటించింది. సినిమా రిలీజ్ అంటే అందరిలో భయం ఉంటుంది. కానీ మాకు ఈ సినిమా పైన పూర్తి నమ్మకం ఉంది. కాబట్టి మేము టెన్షన్ లేకుండా ఉన్నాము. రెండు రోజుల ముందే ప్రీమియర్ ప్లాన్ చేస్తున్నాం.. ఎప్పుడు అనేది త్వరలోనే చెబుతాం అంటూ తెలిపారు. అలాగే గీత ఆర్ట్స్ అరవింద్ గారు మాకు మంచి సపోర్ట్ చేశారు అంటూ చెప్పుకొచ్చారు. ఈ సినిమా రిలీజ్ తర్వాత మరో కొత్త ప్రాజెక్టు కూడా అనౌన్స్ చేస్తామని తెలిపారు.

**విద్య కొప్పినీడి మాట్లాడుతూ..**

ఈ సినిమా కథ విన్నప్పుడే మేము స్టోరీకి బాగా కనెక్ట్ అయ్యాను.. రెగ్యులర్ కమర్షియల్ స్టోరీ కాదు. ప్రతి ఒక్కరు ఈ సినిమా చూశాక మంచి మెసేజ్ తీసుకుంటారు. కమర్షియల్ ఫార్మాట్ స్టోరీ కాకపోయినా రిస్క్ తీసుకోవాలని నేను ధీరజ్ అనుకున్నాము. సెన్సార్ వాళ్ళ దగ్గర నుంచి డైరెక్టర్ కి నేషనల్ అవార్డు దక్కుతుందని ప్రశంసలు కూడా లభించాయి.ఇద్దరం ప్రొడ్యూసర్స్ కాబట్టి ప్రొడక్షన్ కు సంబంధించిన ఏ వర్క్ అయినా షేర్ చేసుకునే చేశాం. ప్రతి డెసిషన్ కలెక్టివ్ గా డిస్కస్ చేసి తీసుకున్నాం. స్టోరీస్ సెలెక్షన్ విషయంలోనూ ఉమ్మడిగానే నిర్ణయాలు తీసుకుంటాం. మా ప్రాజెక్ట్ వెనక అరవింద్ గారి సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. లవ్ స్టోరీస్ చూడటానికి బాగుంటాయి. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ అంతా చూసి ఎంజాయ్ చేస్తారు. లవ్ స్టోరీస్ లోనే ఏదైనా కొత్తగా ఉండి స్ట్రాంగ్ ఫీల్ ఉంటే అలాంటి సినిమాలు చేయాలని అనుకుంటాం. వుమెన్ సెంట్రిక్ అని కావాలని సెలెక్ట్ చేసుకున్నది కాదు కథ ఆ తరహాలో ఉంటుంది. “ది గర్ల్ ఫ్రెండ్” సినిమా రియల్ ఇన్సిడెంట్స్ తో ఇన్స్ పైర్ అయి రాసినా, మిగతా అంతా స్క్రిప్ట్ చేసుకున్నదే.“ది గర్ల్ ఫ్రెండ్” సినిమా షూటింగ్ ఎక్కువగా ఒక కాలేజ్ లో చేశాం.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com